



అయ్యో చిరుత

- గన్నవరం మండలం మెట్లపల్లిలో ఉచ్చులో చిక్కి ప్రాణాలు విడిచిన చిరుత
- ఉలిక్కిపడిన ఉమ్మడి కృష్ణాజిల్లా
- రాజమండ్రి చిరుత ఇదేనా!
- ఇప్పటి వరకు కొండపల్లి అడవిలోనే చిరుతలున్నాయని గుర్తింపు

గన్నవరం మండలం మెట్లపల్లిలోని ఓ మామిడి తోట వద్ద ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకుని చిరుత మృతి చెందిన ఘటనతో ఉమ్మడి కృష్ణాజిల్లా ఉలిక్కిపడింది. రెండు నెలల కిందట పక్క తోటలో పులి పాదముద్రలు కనిపించాయని స్థానికులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ పాదముద్రల విషయం ఇప్పటి వరకు బయటకు పొక్కలేదు. ఈ చిరుత ఎక్కడి నుంచి వచ్చిందన్నది పెద్ద మిస్టరీగా మారింది. ఇదొక్క చిరుతే వచ్చిందా? ఇంకా ఏమైనా చిరుతలు ఉన్నాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఒక్క ఎన్టీఆర్ జిల్లా పరిధిలో మాత్రమే అదీ కొండపల్లి అభయారణ్యంలోనే చిరుతల సంచారం ఉంది. కొండపల్లి అభయారణ్యంలో చిరుతల సంచారం ఉన్నట్టు పదేళ్ల కిందటే అటవీశాఖ అధికారులు గుర్తించారు. పాదముద్రల ఆధారంగా చిరుతలు ఉన్నాయని గ్రహించి వాటి సంరక్షణ కోసం.. నీటి తొట్టెలు వంటివి ఏర్పాటు చేశారు. కొండపల్లి అభయారణ్యం దాటి జనాల్లోకి ఎప్పుడు ఈ చిరుతలు వచ్చింది లేదు. పోనీ కొండపల్లి ఫారెస్ట్ నుంచి వచ్చాయా అనుకోవటానికి కూడా వీల్లేకుండా ఉంది. సమీప ప్రాంతాల వారికి కనపడకుండా మెట్లపల్లి తోటల్లోకి వెళ్లే అవకాశం లేదు. 2015-16లో ఇబ్రహీంపట్నం - నందిగామ మార్గంలో హైవేను ఓ చిరుత దాటిన ఘటన అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఫొటోలు తీయకపోవడం, దాని జాడ తెలియకపోవడంతో ఫేక్ ప్రచారమై ఉంటుందని ఆ తర్వాత అనుకున్నారు. కొంత కాలం కిందట జీ కొండూరు మండలం దుగ్గిరాలపాడులో పాదముద్రలను చూసి పులి అనుకుని భయాందోళనకు గురయ్యారు. ఆ తర్వాత అది పులి పాదముద్రలు కావని, అలుగు పాదముద్రలుగా అటవీశాఖాధికారులు గుర్తించటంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మెట్లపల్లికి ఎక్కడ నుంచి వచ్చింది?

మెట్లపల్లిలోని మామిడి తోటల్లోకి చిరుత ఎలా వచ్చింది.. ఎక్కడి నుంచి వచ్చింది అనేది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో రాజమండ్రిలో చిరుత కనిపించటం కలకలం సృష్టించింది. అప్పట్లో దానిని గుర్తించేందుకు కెమెరాలు ఏర్పాటు చేసినా.. అటవీశాఖాధికారులకు చిక్కలేదు. అదే చిరుత మెట్లపల్లి వచ్చిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల కిందటే పాద ముద్రలు కనిపించాయని స్థానికులు చెబుతున్న నేపథ్యంలో, రాజ మండ్రి ప్రాంతం నుంచి వచ్చిన చిరుత మెట్లపల్లి అటవీ ప్రాంతంలోకి చేరిందని భావిస్తున్నారు. కొత్త ప్రాంతం కావడంతో ప్రతి రోజూ చిరుత రాత్రి సమయాల లో ఆహారం కోసం బయటకు రావటంతో ఇన్నాళ్లూ ఎవరి కంటా పడలేదు.

అడవి పందులకు వేసిన ఉచ్చులో చిక్కి..

మెట్లపల్లి అటవీ ప్రాంతంలో అడవి పందుల సంచారం

మిగతా 6లో..




ఆళ్ల గోపాలకృష్ణ | కోట వీరబాబు

సాగు నీటి సంఘాల ఎన్నికల్లో ఏకపక్ష విజయం సొంతం చేసుకున్న కూటమి నేతలు ప్రస్తుతం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవుల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రధానంగా రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. ఒకటి నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ కాగా, రెండోది కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ పరిధిలో 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ పరిధిలో 26 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీరంతా కలిసి రేపు ప్రాజెక్టు కమిటీ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. చైర్మన్ ఎన్నిక బాధ్యతను టీడీపీ అధిష్ఠానం జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించింది. రేసులో ఉన్న అన్ని వర్గాలతో మాట్లాడి ఎన్నిక ఏకగ్రీవం అయ్యేలా చూసేందుకు ఇన్‌చార్జి మంత్రులు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

- ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవుల కోసం తీవ్ర ప్రయత్నాలు
- నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ రేసులో ఇద్దరు
- కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ రేసులో ముగ్గురు
- ఎన్ఎస్‌పీ పీఠం కోసం కోట వీరబాబు, ఆళ్ల గోపాలకృష్ణ పట్టు
- కృష్ణా డెల్టా పీఠంపై నిడమానూరి దిలీప్, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, గణేశ్ ఆశలు
- సీఎం చంద్రబాబును కలిసిన గోపాలకృష్ణ, దిలీప్
- అడిగిన వారందరికీ లేఖలు ఇచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేలు
- చైర్మన్లు ఎవరో తేలేది రేపు.. ఎన్నిక బాధ్యత ఇన్‌చార్జి మంత్రులకు

పోటాపోటీ!

(విజయవాడ- ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి కోసం తొలుత నందిగామ నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట వీరబాబు ఒక్కరే రేసులో ఉండగా, ప్రస్తుతం సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ కూడా పోటీ పడుతున్నారు. ఎన్ఎస్‌పీ కమిటీ పరిధిలో మూడొంతుల ఆయకట్టు ఎన్టీఆర్ జిల్లాలో ఉంటుందని, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ఎన్టీఆర్ జిల్లాకు ఇవ్వడమే సముచితమని కోట వీరబాబు వర్గం వాదిస్తోంది. ఈ ప్రాజెక్టు పరిధిలో 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా 13 కమిటీలు ఎన్టీఆర్ జిల్లాలో, కృష్ణాలో రెండు, ఏలూరులో రెండు ఉన్నాయి. ఎక్కువ డీసీలు ఉన్న వారికి అవకాశం కల్పించాలన్నది కోట వీరబాబు వర్గం వాదనగా ఉంది. 2015లో ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎగువ ప్రాంతానికి చెందిన వారికి అవకాశం ఇచ్చారని, ఈసారి దిగువ ప్రాంతంలో ఉన్న తమకు అవకాశం ఇవ్వాలని ఆళ్ల గోపాలకృష్ణ వర్గం కోరుతోంది. 2015లో తిరువూరు నియోజకవర్గానికి చెందిన యనమద్ది పుల్లయ్య చౌదరికి నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. అప్పట్లో చైర్మన్ రేసులో ఉన్న గోపాలకృష్ణ అధిష్ఠానం ఆదేశాల మేరకు తప్పుకొని వైస్ చైర్మన్ పదవితో సరిపెట్టుకున్నారు. ఈ సారైనా తనకు చైర్మన్ అవకాశం కల్పించాలని కోరుతూ గోపాలకృష్ణ



గురువారం సీఎం చంద్రబాబును కలిశారు. కోట వీరబాబు మంగళవారమే చంద్రబాబును కలిసి తన పేరును పరిశీలించాల్సిందిగా కోరారు.

తూర్పు కృష్ణాలో ముగ్గురి మధ్య పోటీ

తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీకి మరింత ఎక్కువగా పోటీ నెలకొంది. గుడివాడ నియోజకవర్గం నుంచి మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, పామర్రు నియోజకవర్గం నుంచి వల్లూరుపల్లి గణేశ్, అవనిగడ్డ నియోజకవర్గం నుంచి నిడమానూరి దిలీప్ కుమార్ రేసులో ఉన్నారు.

● చల్లపల్లి మండలం మంగళాపురానికి చెందిన దిలీప్ సీనియర్ టీడీపీ నేత. పార్టీ అధిష్ఠానం ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తూ పార్టీకి విధేయుడిగా పేరుపొందారు. గతంలో చల్లపల్లి ఎంపీపీగా ఎన్నికయ్యే సమయంలో పార్టీ అధిష్ఠానం వేరొకరి పేరును సూచించడంతో దాన్ని వదులుకున్నారు. 2015లో తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఈయనకు అవకాశం కల్పిస్తామని టీడీపీ అధిష్ఠానం హామీ ఇచ్చింది. తొలుత గుడివాడకు చెందిన గుత్తా చంటికి రెండున్నర సంవత్సరాలు ఆ తర్వాత దిలీప్‌కు రెండున్నర సంవత్సరాలు అవకాశం కల్పిస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారు. కానీ గుత్తా చంటి పూర్తికాలం చైర్మన్‌గా కొనసాగారు. అయినా దిలీప్ అవనిగడ్డ నియోజకవర్గంలో టీడీపీ పటిష్ఠానికి పనిచేస్తూ వచ్చారు. అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే పదవి జనసేనకు కేటాయించడంతోపాటు ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులకు ఎలాంటి నామినేటెడ్ పదవులూ కేటాయించలేదు. ఈ నేపథ్యంలో తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ పదవిని తనకు ఇవ్వాలని దిలీప్ పార్టీపెద్దలకు విజ్ఞప్తి చేసుకుంటున్నారు. గురువారం ఆయన సీఎం చంద్రబాబు, కృష్ణాజిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాల్సిందిగా కోరారు.

● వల్లూరుపల్లి గణేశ్ జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. 2014లో పామర్రు మార్కెట్ యార్డు చైర్మన్‌గా పనిచేశారు. పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా ఆశీస్సులతో ఈయన ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ఆశిస్తున్నారు.

● గుడివాడ నియోజకవర్గం నుంచి రేసులో ఉన్న మల్లిపెద్ది సుబ్రహ్మణ్యంకు గుడివాడ ఎమ్మెల్యే రాము ఆశీస్సులు ఉన్నాయి. గుడ్లవల్లేరు మండలానికి చెందిన సుబ్రహ్మణ్యం ఎన్నికల ముందు వరకు టీడీపీలో అంత చురుగ్గా లేరు. ఈ కారణంగా ఈయన అభ్యర్థిత్వంపై పార్టీ సీనియర్లలో అంత సానుకూలత లేదు. కొసమెరుపు ఏమిటంటే.. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ రేసులో ఉన్న వారంతా తమ తమ పరిధిలో ఉన్న ఎంపీలను, ఎమ్మెల్యేలను కలిసి మద్దతు తెలపాలని కోరడమే తరువాయి అడిగిన వారందరికీ వారి పేరును సిఫారసు చేస్తూ ఎంపీలు, ఎమ్మెల్యేలు లేఖలు ఇవ్వడం గమనార్హం.

వైస్ చైర్మన్ పీఠం కోసం..

కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ పీఠం కోసం జనసేన పార్టీ పోటీ పడుతోంది. కూటమిలో భాగస్వాములుగా ఉన్నందున వైస్ చైర్మన్ పీఠం తమకు ఇవ్వాలని జనసేన నాయకులు కోరుతున్నారు. పెడన నియోజకవర్గం నుంచి కమలాపురం డీసీ చైర్మన్‌గా ఎన్నికైన నలమోతు చంద్రమోహన్‌రావుకు ఇవ్వాలని జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పేర్ని బియ్యం కేసులో
తప్పుల జల్లెడ

పౌరసరఫరాల కార్యాలయంలో పోలీసులు, అధికారులు రికార్డుల పరిశీలన

రికార్డులు పూర్తిస్థాయిలో పరిశీలించాకే తదుపరి చర్యలు

సమాచారం చెప్పేందుకు అధికారుల విముఖత

పేర్ని జయసుధ ముందస్తు బెయిల్‌పై విచారణ నేటికి వాయిదా

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మాజీ మంత్రి పేర్ని నాని గోడౌన్‌ల నుంచి పీడీఎస్ బియ్యం మాయం కేసులో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు దర్యాప్తును కొంతమేర వేగవంతం చేశారు. బుధవారం రాత్రి గోడౌన్, వెయింగ్ మిషన్‌ల రికార్డులను మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, డీఎస్పీ అబ్దుల్ సుభాన్, రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రికార్డులన్నీ ఆర్డీవో పర్యవేక్షణలో ఉండగా, గురువారం పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది, పోలీసులు పరిశీలించే పనిని చేపట్టారు. పీడీఎస్ బియ్యం మాయం కేసులో ఇంకా పూర్తిస్థాయి వివరాలను తమకు అందించలేదని, కావాల్సిన వాటిని అడిగి తీసుకుంటున్నామని ఆర్‌పేట సీఐ ఏసుబాబు తెలిపారు.

2021 నుంచి లెక్కలు తీసే పనిలో అధికారులు

మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్ని నాని భార్య పేర్ని జయసుధ పేరులో 2021 నుంచి గోడౌన్‌లను పౌరసరఫరాల శాఖ అద్దె ప్రాతిపదికన నడుపుతోంది. గత నెల 26వ తేదీన తనకు చెందిన గోడౌన్‌లో 3,708 బస్తాల పీడీఎస్ బియ్యం తరుగు ఉన్నాయని, ఈ మొత్తానికి ఎంతమేర నగదు చెల్లించాలో సూచిస్తే, అంతమేర నగదును చెల్లిస్తామని జేసీ గీతాంజలిశర్మకు పేర్ని జయసుధ లేఖ రాశారు. ఈ లేఖను ఆధారంగా చేసుకుని అధికారులు గత నెల 28, 29, 30 తేదీల్లో జేసీ ప్రత్యేకంగా నియమించిన పౌరసరఫరాలశాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి నివేదికను అందించారు. మాయమైన



మచిలీపట్నం మండలం పొట్లపాలెంలోని పేర్ని నానికి చెందిన గోడౌన్‌ల వద్ద వెయింగ్ మిషన్


బియ్యం మొత్తానికి రెట్టింపుధరను నిర్ణయించి రూ.1,70,56,800 గోడౌన్ యజమాని నుంచి కట్టించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. బియ్యం మాయం ఘటనలో పౌరసరఫరాలశాఖ అధికారులు మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. ఇంతా జరిగినా గోడౌన్ తాళాలు, రికార్డులు సకాలంలో ఇవ్వకుండా పేర్ని కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లి అధికారులను ముప్పతిప్పలు పెట్టింది.

కరగ్రహారంలో ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌లను పక్కనపెట్టి

మచిలీపట్నం మండలం కరగ్రహారంలో ప్రభుత్వానికి చెందిన ఎస్‌డబ్ల్యూసీ గోడౌన్‌లు అందుబాటులో ఉన్నా, వాటిలో బియ్యం నిల్వ ఉంచకుండా పేర్ని నానికి చెందిన గోడౌన్‌లలోనే అధికారులు గత మూడు సంవత్సరాలుగా అధికంగా బియ్యం నిల్వలు ఉంచారు. పేర్ని నాని భార్య జయసుధ పేరుతో ఉన్న గోడౌన్‌లలో 2021 నుంచి పెద్దమొత్తంలో బియ్యం నిల్వలు ఉంచి, అక్కడి నుంచి జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు తరలించారు. ఇక్కడి గోడౌన్‌లలోని ఒక్కోబ్యాగులో 50.300 కేజీల చొప్పున బియ్యం ఉండాలి. కానీ ఒక్కోబ్యాగులో 47, 48 కిలోల బియ్యం మాత్రమే ఉండటం, తదితర కారణాలతో బియ్యం మాయం లెక్కలపై తుది నిర్ణయానికి అధికారులు రాలేకపోతున్నారనే వాదన ఉంది. గతంలో పేర్ని నాని మంత్రిగా ఉండటంతో ఈ గోడౌన్‌లలో ఏం జరుగుతుందో తనిఖీ చేసేందుకు అధికారులు సాహసించలేదు. పీడీఎస్ బియ్యం ఇటీవల కాలంలోనే మాయమయ్యాయా, లేక గోడౌన్‌లు అద్దెకు తీసుకున్న నాటినుంచి మయామవుతూ వచ్చాయా, అనే అంశంపై లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించింది. దీంతో అధికారులు పేర్ని నాని గోడౌన్‌లకు సంబంధించిన రికార్డులను, వెయింగ్‌మిషన్ వద్ద కంప్యూటర్‌లను స్వాధీనం చేసుకుని లెక్కలుచూసే పనిలో ఉన్నారు. ఈ పని పూర్తయితే, ఈ గోడౌన్‌ల నుంచి ఎంతమేర బియ్యం మాయమయ్యాయనే అంశంపై తుది నివేదిక వచ్చే అవకాశం ఉందని, అప్పటివరకు తాము ఎలాంటి సమాచారం ఇవ్వలేమని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. సిబ్బంది ఎవరికి వారు రికార్డుల తనిఖీ ప్రక్రియను తాము చేయడం లేదని చెప్పడం గమనార్హం. పౌరసరఫరాలశాఖ క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పనిచేసే సిబ్బంది ఈ పనిలో ఉన్నారని కొందరు సిబ్బంది చెబుతుండగా... క్వాలిటీకంట్రోల్ విభాగం సిబ్బంది వద్దకు వెళ్లి వివరాలు కావాలని అడిగితే, ఈపని మేము చేయడలేదని, పొట్లపాలెం గోడౌన్‌లోని బియ్యంను ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించే పనిని చేశామని, అప్పటితో మా పనిపూర్తయిందని చెప్పి తప్పించుకుంటున్నారు. పేర్ని నాని గోడౌన్‌లలో వెయింగ్ మిషన్‌లో లోపం ఉందనే కొత్త వాదనను పేర్ని తరపు న్యాయవాదులు తెరపైకి తెచ్చారు. వెయింగ్ మిషన్ ఎప్పటినుంచి సక్రమంగా పనిచేయడం లేదనే అంశంపైనా అధికారులు రికార్డులను బట్టి పరిశీలిస్తామని మాత్రం చెబుతున్నారు. పౌరసరఫరాలు, పోలీస్, రెవెన్యూ విభాగాల అధికారులు విచారణ జరుగుతోందని, ఇంకా చాలా రోజుల సమయం పడుతుందని చెప్పి తప్పించుకుంటున్నారు.

ముందస్తుబెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

మచిలీపట్నంలో పీడీఎస్ బియ్యం మాయం కేసులో విచారణ నిమిత్తం విజయవాడకు చెందిన స్పెషల్ పీపీ, జాయింట్ డైరెక్టర్ విజయను ప్రాసిక్యూషన్ తరపున వాదించేందుకు ప్రభుత్వం నియమించింది. ఈ కేసు గురువారం విచారణకు వచ్చింది. స్పెషల్ పీపీ ఈ కేసులో విచారణను సోమవారానికి వాయిదా వేయాలని కోరారు. అయితే 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి ఎస్.సుజాత శుక్రవారం) ఈ కేసు విచారణను వాయిదా వేశారు. ఈ కేసులో నిందితురాలిగా పేర్కొన్న పేర్ని జయసుధ తరపు న్యాయవాదులు పేర్ని జయసుధను అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరగా న్యాయాధికారి తిరస్కరించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు
నేడు జిల్లాకు రాక

- గంగూరులో రైతు సేవా కేంద్రం సందర్శన
- ఈడుపుగల్లులో రెవెన్యూ సదస్సుకు హాజరు



మచిలీపట్నం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10.40 గంటలకు ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.55 గంటలకు పెనమలూరు మండలం గంగూరులోని ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి 11.05 గంటలకు గంగూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి అక్కడి సిబ్బంది, రైతులతో మాట్లాడుతారు. అక్కడే ఉన్న వెంకటాద్రి రైస్ మిల్లును పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.50 గంటలకు మళ్లీ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.40 గంటలకు కంకిపాడు మండలం ఈడుపుగల్లు వెళ్తారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు అక్కడ జరిగే రెవెన్యూ సదస్సులో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. 3.45 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి గన్నవరం విమానాశ్రయానికి 3.55 గంటలకు వెళతారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు.

ఆర్-5 జోన్‌కు
గృహయోగం

అమరావతి ఆర్-5 జోన్ లబ్ధిదారులకు బెజవాడలో టిడ్కో ఇళ్లు

- రాజధాని అభివృద్ధి నేపథ్యంలో ఆర్-5 జోన్ రద్దు
- ఆ 25 వేల మందికి టిడ్కో ఇళ్లు ఇవ్వాలని నిర్ణయం
- 265 ఎకరాల సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు
- విజయవాడ రూరల్, జి.కొండూరు మండలాల్లో అన్వేషణ

రాజధాని అమరావతి ఆర్-5 జోన్‌లో నగరానికి చెందిన పేదలకు గత ప్రభుత్వం కేటాయించిన నివేశనా స్థలాల స్థానంలో టిడ్కో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 25 వేల మంది పేదలకు టిడ్కో ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు 265 ఎకరాల భూములను సేకరించాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి అధికారులు విజయవాడ రూరల్ మండలంలో భూ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రూరల్ మండలాలైన కొత్తూరు తాడేపల్లితో పాటు వెలగలేరులో భూములు సేకరించేందుకు రెవెన్యూ యంత్రాంగం ప్రయత్నాలు మొదలుపెట్టింది. కొత్తూరు తాడేపల్లిలో రైతులే స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తొలుత పోలవరం కాల్వ దగ్గర భూములను అధికారులు పరిశీలించారు. బుడమేరు వరద ముంపునకు గురైన ప్రాంతం కాబట్టి.. అక్కడ టిడ్కో ఇళ్లు నిర్మిస్తే సమస్యలు వస్తాయన్న వాదనలు వచ్చాయి. అలాగే, పోలవరం అవతల ఎగువ ప్రాంత రైతులు కూడా తాము తక్కువ ధరకే భూములిస్తామని, మెరక కూడా చేయాల్సిన అవసరం లేదని, ప్రభుత్వంపై ఖర్చు తగ్గుతుందని ప్రతిపాదనలు తీసుకొచ్చారు. రైతుల మధ్య నెలకొన్న పోటీ కారణంగా స్థానిక రెవెన్యూ యంత్రాంగం గందరగోళంలో పడింది. పేదల కోసం నిర్మించే టిడ్కో ఇళ్లు వరద ప్రభావిత ప్రాంతంలో కట్టించకూడదని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఇటీవల డీఆర్‌సీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మెరకగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేయాలని జిల్లా రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది. ఈ అంశంపై



జక్కంపూడిలో సిద్ధమవుతున్న టిడ్కో ఇళ్లు

విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య దృష్టిపెట్టారు. రూరల్ మండల తహశీల్దార్ సుగుణ కూడా అవసరమైన భూముల కోసం రైతులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

గతంలో.. టీడీపీ హయాంలో..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జక్కంపూడిలో జెట్‌సిటీ నిర్మాణం మొదలైంది. ఇందులో భాగంగా టిడ్కో ఇళ్ల పనులు పనులు చేపట్టారు. దాదాపు 6 వేల ఇళ్ల నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి. జెట్‌సిటీని విస్తరించి ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి వీలుగా గతంలో షాబాదలో భూములు సేకరించాలని

మిగతా 6లో..

అక్రమ క్వారీయింగ్‌కు చెక్ | 6లో | భవానీలకు మెరుగైన సౌకర్యాలు | పరాయివారిదే కిరాయి | 8లో | పాతికేళ్ల శ్రమ నూరేండ్ల నా ఊరు



కొండపల్లి ఖిల్లాను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

ఖిల్లా చూసొద్దాం రండి..

- పర్యాటకులను ఆకర్షించేలా మౌలిక వసతులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండపల్లి ఖిల్లా ఔన్నత్యాన్ని భావితరాలకు చాటి చెప్పడంతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా సాంస్కృతిక, పురావస్తు మ్యూజియం, టూరిజంశాఖల సమన్వయంతో ఖిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కొండపల్లి ఖిల్లాను ఆయన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి జి.వాణిమోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు తలమానికం అయిన కొండపల్లి ఖిల్లాను అభివృద్ధి చేసి పర్యాటకులను మరింతగా అకట్టుకునేందుకు చర్యలు చేపడతామన్నారు. ఖిల్లాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 2019లో కొండపల్లి ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించారన్నారు. కొండపల్లి కోట చరిత్ర సజీవంగా నిలిపే విధంగా మరమ్మతులు చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఖిల్లా ప్రదర్శనలో ఉన్న ఫోటోలను యాప్ ద్వారా అండ్రాయిడ్ ఫోన్‌లో స్కాన్ చేసి దాని విశిష్ఠతను తెలుసుకునేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఏపీ ప్రభుత్వం 2047 విజన్ డాక్యుమెంట్‌లో పర్యాటకరంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతీరోజు ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నట్టు చెప్పారు. ప్రిన్సిపల్ సెక్రటరీ జి.వాణిమోహన్ మాట్లాడుతూ, 10 శతాబ్ది కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు అనేకమంది రాజులు కొండపల్లి కోట నుంచి పరిపాలన సాగించారన్నారు. 2019లో కొండపల్లి కోట అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో టూరిజంశాఖ రీజనల్ జేడీ వైవీ ప్రసన్నలక్ష్మి, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, సహాయ టూరిజం అధికారి డి.గోపాల్, పురావస్తుశాఖ ఉపసంచాలకులు ఓ.రామసుబ్బారెడ్డి, పి.సురేష్, స్వామినాయక్, నరసింహనాయుడు, ఎస్.వెంకట్రావ్, డీవీఎం చైతన్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భవానీలకు మెరుగైన సౌకర్యాలు

- 21 నుంచి అంతరాలయ దర్శనాలు నిలిపివేత
- అన్ని క్యూలలో భక్తులకు ఉచిత దర్శనం
- దీక్షల విరమణ ఏర్పాట్లపై ఈవో సమీక్ష

వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణల సందర్భంగా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు దుర్గామల్లేశ్వర దేవస్థానం ఈవో కేఎస్ రామారావు తెలిపారు. మహామండపంలో గురువారం భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు, ఈఈలు, దేవస్థాన స్థానాచార్యులు, ముఖ్య అర్చకులు, ఏఈవోలు, డీఈలు, ఇంజనీరింగ్, ఐటీ విభాగం, సెక్యూరిటీ, శానిటేషన్ తదితర విభాగాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, బుధవారం కలెక్టరేట్‌లో అధికారుల సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. క్యూలు, షెడ్లు, విద్యుదీకరణ, మైక్, సౌండ్ సిస్టమ్, ఇరుముడి విరమణ పాయింట్లు, నగరం వెలుపల భక్తులు వేచి ఉండే పాయింట్లు, కొబ్బరికాయలు కొట్టే ప్రదేశం, హోమ గుండాల నిర్వహణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. 21 ఉదయం 6.30 గంటల నుంచి అమ్మవారి దర్శనం లభిస్తుందని, 22 నుంచి 25వ తేదీ వరకు వేకువజామున 3 నుంచి తిరిగి రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం ఉంటుందని తెలిపారు. అన్ని క్యూలలో భక్తులు ఉచిత దర్శనం చేసుకోవచ్చునని, అంతరాలయ ప్రవేశం లేదని, టిక్కెట్టు కౌంటర్లు ఉండవని తెలిపారు. అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్టు తెలిపారు. కనకదుర్గానగర్‌లోని ప్రసాదం కౌంటర్లతో పాటు బస్టాండ్, రైల్వేస్టేషన్ 1వ నెంబరు ప్లాట్‌ఫారంపై మూడు షిఫ్టుల్లో ప్రసాదం కౌంటర్లు పనిచేస్తాయని తెలిపారు. సెక్యూరిటీ, సీసీ కెమెరాలు, శానిటేషన్, మంచినీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ కీలకమని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ చేసే భవానీల సౌకర్యం నిమిత్తం కొండచుట్టూ టెంట్లు, వైద్య శిబిరాలు, మరుగుదొడ్లు, వాటర్ ప్యాకెట్ల పంపిణీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. క్యూలైన్లలో మజ్జిగ, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. సీతమ్మవారి పాదాల ఘాట్‌లో 500 షవర్లు, భవానీ ఘాట్‌లో 100 షవర్లు, పున్నమీఘాట్‌లో 100 షవర్లు ఏర్పాటు చేశారు. భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కంట్రోల్ రూమ్‌లో అన్ని శాఖల అధికారులు మూడు షిఫ్టుల్లో పనిచేస్తారని వివరించారు.



భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామారావు



భవానీ దీక్షల విరమణ సందర్భంగా చురుగ్గా ఏర్పాట్లు



దీక్షల విరమణ కోసం హోమగుండం ఏర్పాటు

భవానీలు, భక్తులకు ఉచిత అన్నప్రసాదం

ఈనెల 21నుంచి 25వ తేదీ వరకు భవానీ దీక్ష విరమణల సందర్భంగా దేవస్థానానికి వచ్చే భవానీలు, భక్తులకు ఉచిత అన్న ప్రసాదం అందజేయనున్నట్టు ఈవో రామారావు తెలిపారు. ఉదయం 6.30 నుంచి 10.30 వరకు పులిహోర, పొంగలి ప్రసాదం పంపిణీ, ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అన్నవితరణ కార్యక్రమం ఉంటుందని, సాయంత్రం నుంచి రాత్రి వరకు పులిహోర, ప్రసాదం పంపిణీ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు ఏర్పాట్లు చేపట్టినట్టు చెప్పారు. సుమారు 25 లక్షల లడ్డూలు తయారీకి ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు.



దక్షిణామూర్తికి ప్రత్యేక అర్చనలు

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దక్షిణామూర్తికి గురువారం సందర్భంగా ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకాలు, అనంతరం ప్రత్యేక అర్చనలు, షోడశోపచార పూజలను నిర్వహించి, మంత్రపుష్పం, హారతులు ఇచ్చారు.



దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

దాతల విరాళాలు..

విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన దాతలు యర్రం హరీష్ గురువారం అన్నతవితరణ నిమిత్తం డిప్యూటీ ఈవో రత్నరాజుకు రూ.1,00,000లు చెక్కు రూపంలో అందజేశారు. యర్రం తిరుమలరావు రూ.1,00,000లు ఆలయ స్వర్ణ తాపడం పనుల నిమిత్తం చెక్కు రూపంలో అందజేశారు. విజయవాడ వెటర్నరీ కాలనీకి చెందిన దాత బి.జానకి కుటుంబసభ్యులతో కలిసి దుర్గమ్మను దర్శించుకుని అన్నవితరణ నిమిత్తం రూ.1,01,116 చెక్కును బి.పాపయ్య రెడ్డి పేరిట అందజేశారు.

ఏర్పాట్ల పరిశీలన

భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లను గురువారం డిప్యూటీ ఈవో రత్నరాజు పరిశీలించారు. కనకదుర్గానగర్‌లోని ప్రసాదాల కౌంటర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం క్యూలను పరిశీలించారు. భవానీ దీక్షలు 2024 యాప్‌ను భక్తులు వినియోగించుకోవాలని కోరారు.



హైకోర్టు న్యాయమూర్తి ఎన్.హరినాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి డిప్యూటీ ఈవో రత్నరాజు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.

కారుణ్య నియామకాలు చేపట్టండి

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు వినతులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చాలా కాలం క్రితం తమ తండ్రి, తల్లి విధి నిర్వహణలో మృతి చెందారని, నిబంధనల ప్రకారం తమకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన బాధితులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణ వారితో మాట్లాడారు. కారుణ్య నియామకాలపై సీఎం చంద్రబాబుతో చర్చించి చేపడతామన్నారు. నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కొత్తగా ఎలక్ట్రానిక్ బస్సులు కొనుగోలు చేస్తామని, ఆ సమయంలో కారుణ్య నియామకాలు చేపడతామన్నారు.

అక్రమార్కులపై చర్యలు తప్పవు

- జనసేన నేత బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొత్తపూడిలోని పేర్నినానికి చెందిన బఫర్ గిడ్డంగుల్లో పీడీఎస్ బియ్యం మాయం కేసులో ప్రభుత్వం చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న పేర్ని నాని ఎప్పుడూ నీతులు బోధించేవారని, అందుకే తప్పు ఒప్పుకుని మాయమైన పీడీఎస్ బియ్యానికి రూ.కోటి 70 లక్షలు చెల్లించారన్నారు. గిడ్డంగి నిర్మాణంలోనూ పేర్ని నాని పలు అవకతవకలకు పాల్పడ్డారని, వాటిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పేర్ని నాని ఇప్పటికైనా తన తప్పును పూర్తిగా ఒప్పుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

సిట్‌తో విచారణ జరపాలి : టీడీపీ డిమాండ్

పేర్ని నాని గోడౌన్‌లో పీడీఎస్ బియ్యం మాయం కేసును సిట్ పరిధిలోకి తెచ్చి సమగ్ర విచారణ జరిపించాలని టీడీపీ నాయకులు ఐ.దిలీప్ కుమార్, పీవీ ఫణికుమార్ డిమాండ్ చేశారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ, సామాన్య ప్రజలు చిన్న నేరం చేస్తేనే గంటల తరబడి స్టేషన్‌లో కూర్చోబెట్టి ప్రతాపం చూపించే పోలీసులు ఇంత పెద్ద నేరం జరిగినా నిందితులను అరెస్టు చేయకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కేసును నీరుగార్చకుండా సిట్ పరిధిలోకి తెచ్చి విచారణ జరపాలన్నారు.

అబాకస్ అంతర్జాతీయ విజేత చార్విక



గుడ్లవల్లేరు, డిసెంబరు, 19 (ఆంధ్రజ్యోతి): యూసీమాస్-2024 పేరిట న్యూఢిల్లీలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ అబాకస్, మెంటల్ అర్థమెటిక్ పోటీల్లో గుడ్లవల్లేరుకు చెందిన ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాఠశాలలో మూడోతరగతి చదువుతున్న గొట్టిపాటి చార్విక విజేతగా నిలిచింది. గ్రామానికి చెందిన గొట్టిపాటి రామకిషోర్, నాగలక్ష్మిల కుమార్తె చార్విక. తల్లి నాగలక్ష్మి గోరుముద్దలు తినిపిస్తూనే మాతృభాషతో పాటు అబాకస్ నేర్పించడం.. తల్లి శిక్షణలో రాణించి అంతర్జాతీయ స్థాయిలో ఎలిమెంటరీ బి ఇంటర్నేషనల్ విభాగంలో 3వ రన్నరప్‌గా, ఎలిమెంటరీ బి జాతీయ విభాగంలో మెరిట్ ఫేజ్ విన్నర్‌గా చార్విక నిలిచింది. ఢిల్లీ నుంచి గురువారం గ్రామానికి వచ్చిన చిన్నారి చార్వికను, ఆమె తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం, స్థానిక లయన్స్ క్లబ్ ప్రతినిధులతో పాటు గ్రామస్థులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కూచిపూడి : మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో బయోటెక్నాలజీ గెస్ట్‌లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు సాధించిన ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు, జనవరి 2వ తేదీన పూర్తి ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు. యూజీసీ నెట్, సెట్, పీహెచ్‌డీ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆత్మీయత, మానవత్వం చూపండి

- వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల స్నేహశీల జిల్లా లక్ష్యంగా పనిచేయాలి
- సామాజిక భద్రతకు భరోసా కల్పించాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల స్నేహశీల జిల్లాగా గుర్తింపు తీసుకొచ్చేందుకు సమన్వయ శాఖల అధికారులు కృషిచేయాలని, వారి సంక్షేమానికి సంబంధించిన చట్టాల అమల్లో ఆత్మీయత వెల్లివిరియాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీల సమావేశాలు జరిగాయి. గత నిర్ణయాల అమలును సమీక్షించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉపయోగపడేలా ర్యాంపుల సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెసల్ ఆఫీసర్ (జీఆర్ఓ)లను నియమించుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో ఉచిత సేవలకు హై పవర్డ్ మానిటరింగ్ కమిటీ సమర్థవంతంగా పనిచేయాలన్నారు.



కలెక్టర్ సమక్షంలో అవగాహన కార్యక్రమం

వయోవృద్ధులకు చేయి అందించాలి

వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు మానవతతో చేయి అందించాలని కలెక్టర్ సూచించారు. వారి ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమాజంలో వృద్ధులు గౌరవప్రదంగా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా జీవించేందుకు అనువైన వాతావరణం కల్పించేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరముందని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఎల్ఎస్ఏ సెక్రటరీ రామకృష్ణ, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి వాగ్దేవు కామరాజు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఆర్డీవోలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

కిశోరి వికాసం ద్వారా ఉజ్వల భవిత

కృష్ణలంక : కిశోరి వికాసం ద్వారా బాలికలకు ఉజ్వల భవిష్యత్తు అందించడంలో సమష్టి కృషి అవసరమని విద్య, మానసిక ఆరోగ్యం, ఋతు పరిశుభ్రత, పోషకాహారం, అక్రమ రవాణా, పోక్సో చట్టం, ఆత్మ రక్షణ, యోగ, జీవనోపాధి వంటి అంశాలపై బాలికలలో అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, మహిళా శిశు సంక్షేమశాఖ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థినులతో కిశోరి వికాసం కార్యక్రమ అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల భవిష్యత్తును మెరుగుపరచడానికి కిషోరి వికాసం ఒక మంచి అవకాశమన్నారు. 11 నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం కార్యక్రమ లక్ష్యమన్నారు. బాలికలు అన్ని విధాలా ఎదగడానికి వున్న అడ్డంకులను తొలగించడంలో పటిష్ట భాగస్వామ్యం వుండాలన్నారు. మహిళా శిశు సంక్షేమ జిల్లా ప్రాజెక్ట్ డైరక్టర్ జి.ఉమాదేవి మాట్లాడుతూ, కిశోరీ వికాసం కార్యక్రమంలో మార్పు ట్రస్ట్ అధ్వర్యంలో మేరీస్టెల్లా కళాశాల విద్యార్థినులు నిర్దేశించిన అంశాలపై ఆరు నెలల పాటు ఇంటర్న్ షిప్ చేస్తున్నారన్నారు. సమావేశంలో మార్పు ట్రస్ట్ డైరక్టర్ ఆర్.సూయజ్, ప్రముఖ సైకాలజిస్ట్ శివజ్యోతి, చేయూత సంస్థ ప్రతినిధి టి.కృష్ణకుమారి, స్వీయ రక్షణ నిపుణురాలు లక్ష్మీ సామ్రాజ్యం, కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.



కూచిపూడి కళాపీఠం నాట్యాచార్యులతో యూపీ విద్యార్థుల బృందం

కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠాన్ని సందర్శించిన యూపీ బృందం

కూచిపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సాంస్కృతిక ఐక్యత, సహకారాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన 40మంది విద్యార్థుల బృందం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠాన్ని సందర్శించింది. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో వచ్చిన బృందానికి కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ స్వాగతం పలికి కూచిపూడి నాట్య పుట్టుక, విశిష్టతను విద్యార్థుల బృందానికి వివరించారు. డైరెక్టర్ రమేష్ శ్రీకొండ, రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ ఎస్.వి.కృష్ణకుమార్, నోడల్ అధికారి జె.ఎం.భగవత్, కో-ఆర్డినేషన్ టీమ్ నవీన్, ప్రణతి ఆధ్వర్యంలో ఈ బృందం పర్యటించింది. కళాపీఠం నాట్యాచార్యులు రవిబాలకృష్ణతోపాటు యేలేశ్వరపు శ్రీనివాస్, వెంకట దుర్గాభవాని, హరనాథ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీయింగ్‌కు చెక్

- కొత్తూరు తాడేపల్లిలో రెవెన్యూ మెరుపుదాడి
- 2 ఎక్స్‌కవేటర్లు, 6 టిప్పర్ల స్వాధీనం
- స్థానికుల ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

విజయవాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు తాడేపల్లిలోని సర్వే నెంబర్ 34లో జరుగుతున్న అక్రమ క్వారీయింగ్‌పై గురువారం మెరుపుదాడి జరిగింది. ఒక్కసారిగా దాడిచేసిన రెవెన్యూ అధికారులు రెండు ఎక్స్‌కవేటర్లు, ఆరు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని టూ టౌన్ అవుట్‌పోస్టుకు తరలించారు. తెల్ల చట్టును గుట్టుచప్పుడు కాకుండా తరలించటాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థకు సంబంధించిన లైజనింగ్ మేనేజర్ ఒకరు సూత్రధారిగా రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు.

అనుమతులు లేకున్నా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ క్వారీయింగ్ వ్యవహారాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అప్పటి వరకు తవ్వకాలకు అనుమతి లేదు. కానీ, పశ్చిమ బైపాస్ బ్యాలెన్స్ పనుల నిమిత్తం గ్రావెల్ కోసం జిల్లా యంత్రాంగం నుంచి అనుమతులు తెచ్చుకున్న లైజనింగ్ మేనేజర్ ఈ తరహా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం తెలిసి తాము ప్రశ్నిస్తే కలెక్టర్ అనుమతి ఉందని మభ్యపెడుతున్నారని, కాగితాలు మాత్రం చూపట్లేదని పేర్కొన్నారు. అనుమతులపై అటు మైనింగ్, ఇటు రెవెన్యూ అధికారులను సంప్రదించినా సరైన సమాధానం చెప్పలేకపోయారు. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు దాడులుచేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇది జరిగి నాలుగు రోజులు కూడా కాకముందే అదే నిర్వాహకులు కొత్తూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 34లోని తెల్లచట్టు తవ్వకాలకు పూనుకున్నారు. స్థానికులు ప్రశ్నిస్తే.. దౌర్జన్యంగా మాట్లాడటంతో రెవెన్యూ అధికారులకు మళ్లీ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే గురువారం దాడులు జరిగాయి.



కొత్తూరు తాడేపల్లిలో అక్రమ క్వారీయింగ్

ఆర్-5 జోన్‌కు గృహయోగం

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు. జక్కంపూడి, వేమవరం, షాబాదలో 100 ఎకరాలు సేకరించాలనుకున్నారు. ఎకరాకు రూ.కోటి పరిహారం చొప్పున ఇవ్వటానికి కూడా సిద్ధపడ్డారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ భూములను తీసుకోలేదు. జక్కంపూడి, షాబాద, వేమవరానికి దగ్గరగా ఉండేలా కొత్తూరు తాడేపల్లిలో వీలైనంత ఎక్కువగా భూములు సేకరించాలని ప్రస్తుతం విజయవాడ రూరల్ మండల రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు.

ప్రధాన మార్గం అవసరం

టిడ్కో ఇళ్లకు చేరుకోవటానికి వీలుగా గ్రాండ్ రోడ్డుగా పోలవరం కట్టరోడ్డును అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు వస్తున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం నుంచి నున్న వరకు పోలవరం కాల్వకట్ట వెంబడి రోడ్డును అభివృద్ధి చేశారు. అయితే, ఈ రోడ్డు మధ్యలో కల్వర్టులను నిర్మించకపోవటం వల్ల పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. కల్వర్టులను ఏర్పాటు చేయటంతో పాటు గన్నవరం నుంచి ఏలూరు జిల్లాకు అనుసంధానం చేస్తే.. టిడ్కో ఇళ్లకు గ్రాండ్ ఎంట్రన్స్ రోడ్డు ఏర్పడుతుంది. ఇదే కనుక చేస్తే జక్కంపూడిలోని జెట్‌సిటీకి, కొత్తూరు తాడేపల్లిలో నిర్మించే టిడ్కో ఇళ్లకు ప్రధాన రోడ్డుగా మారుతుంది. ఇక్కడివారు తాము పనులు చేసుకునే ప్రాంతాలకు సులువుగా వెళ్లేలా రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే నున్న, అంబాపురం, నైనవరం, పాత పాడు, జక్కంపూడి, షాబాద, వేమవరం తదితర అనేక గ్రామాలకు ప్రధాన రాజమార్గం అవుతుంది. పోలవరం కాల్వకట్ట రోడ్డును కూడా దృష్టిలో ఉంచుకుని ఈ కాల్వకు ఎగువన భూములపై దృష్టి సారించాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది.

మౌలిక వసతుల కల్పనకు 878 గిరిజన గ్రామాల ఎంపిక

- పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం


వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మౌలిక వసతుల కల్పనకు 'ధరితి ఆబాజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్' కింద ఏపీలో 878 గ్రామాలు ఎంపిక చేసినట్టు కేంద్ర గిరిజన వ్యవహారాల సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే వెల్లడించారు. పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ కేశినేని శివనాథ్ అడిగిన మేరకు మంత్రి సమాధానం ఇచ్చారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు, ఆరోగ్యం, విద్య, అంగన్వాడీ సౌకర్యాలు, జీవనోపాధి అవకాశాలను మెరుగు పరచటానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించినట్టు తెలిపారు. దేశంలో 63,843 గ్రామాల్లో ఈ పథకం అమలవుతోందని, ఏపీలో 878 గ్రామాలు ఎంపిక చేసినట్టు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో 17 గ్రామాలు మాత్రమే ఎంపికైనట్టు మంత్రి వివరించారు. 500మందికి పైగా జనాభా ఉన్న గ్రామాలు, కనీసం 50శాతం గిరిజన జనాభా ఉంటే ఈ పథకం కింద ఎంపిక చేస్తామని చెప్పారు. ఏపీలో ఈ పథకం కింద 25 రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. పీఎం అవాస్ యోజన పథకం కింద 20 లక్షల పక్కా ఇళ్లు, గ్రామీణ సడక్ యోజన ద్వారా 25 వేల కిలోమీటర్ల మేరకు కనెక్టింగ్ రోడ్లు జల జీవన్‌మిషన్‌ద్వారా ప్రతి అర్హతగల గ్రామానికి మంచినీటి సరఫరా, విద్యుత్ లేని కుటుంబానికి కనెక్షన్ ఇవ్వటం వంటివి ఇందులో ఉన్నాయన్నారు.

ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రికి ఎంపీ శివనాథ్ వినతి

వన్‌టౌన్ : విజయవాడలో ఆటోమొబైల్ రంగ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సహాయ మంత్రి జయంతి చౌదరికి గురువారం ఎంపీ కేశినేని శివనాథ్ వినతిపత్రం అందజేశారు. విజయవాడలో 'ప్రధాన మంత్రి కేవీవై' పథకం కింద అధునాతన ఆటోమొబైల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. విజయవాడలో ఆటోమొబైల్ రంగం అసంఘటిత కార్మికులుగా సుమారు లక్షమంది పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయించి శిక్షణ ఇప్పించాలన్నారు. మంత్రి స్పందించి నాలుగురోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

నాయీబ్రాహ్మణ సంఘాల జేఏసీ గౌరవాధ్యక్షుడిగా కొలిపాక



కొలిపాక బ్రహ్మం

పెనుగంచిప్రోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ ఆలయాల నాయీబ్రాహ్మణ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ గౌరవాధ్యక్షుడిగా పెనుగంచిప్రోలుకు చెందిన బీసీ సెల్ నేత టీడీపీ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు కొలిపాక బ్రహ్మంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటుపల్లి రామదాస, గౌరవ సలహాదారుగా గండిరెడ్డి రాము, ప్రధాన కార్యదర్శిగా ఏలూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా అమలాపురం గౌరీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎం.సాయిబాబా, కార్యదర్శిగా పసుపులేటి సత్యనారాయణతోపాటు పలువురు సభ్యులతో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అయ్యో.. చిరుత

(5వ పేజీ తరువాయి)

ఎక్కువ. వీటిని పట్టుకోవటానికి వేటగాళ్లు ఉచ్చులు పన్నుతుంటారు. అలా ఓ మామిడితోట ఫెన్సింగ్ సమీపంలో వేటగాళ్లు ఉచ్చు వేశారు. ఈ ఉచ్చులో చిక్కుకుని చిరుత మృతి చెందింది. ఎప్పుడూ చిరుతల సంచారం గురించి వినని ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలు తాజా ఉదంతంతో రాత్రిపూట బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103,111, 122
చికెన్ విత్ స్కిన్	192
చికెన్ స్కిన్‌లెస్	202

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 610

తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత

గన్నవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని తిరుపతమ్మ తల్లి ఆలయ సేవా సదన్ నిర్మాణానికి పట్టణానికి చెందిన గుండపనేని వెంకటరత్నం, శ్రీదేవి దంపతుల కుమార్తెలు ఐనంపూడి లవకుమార్ లక్ష్మీ చరిత, చుక్కపల్లి సోమశేఖర్ లక్ష్మీ పూజితలు రూ.50,116 విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అందరి సహకారంతో అమ్మవారి వార్షిక కల్యాణానికి సేవ సదనాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కాసన్నేని నాని జాస్తి ఫణిశేఖర్, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న వెంకటరత్నం, శ్రీదేవి



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎంఆర్ఎఫ్ చెక్కులు

పెనమలూరు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వణుకూరు గ్రామానికి చెందిన డోకల సరళవేణి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన నాలుగు లక్షల విలువైన చెక్కును గురువారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందజేశారు.

రోడ్డు పనులకు భూమి పూజ

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద రూ.20లక్షలు అంచనాలతో స్థానిక ఇందిరానగర్‌లో ఆరు సీసీ రోడ్డు పనులకు గురువారం బాపులపాడు మండల కూటమి నాయకులు భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. నాయకులు దయాల రాజేశ్వరరావు, మూల్పూరి సాయికల్యాణి, అట్లూరి శ్రీనివాసరావు,దుట్టా శివన్నారాయణ,వడ్డి నాగేశ్వరరావు, తోట మురళీధర్, చిన్నాల లక్ష్మీనారాయణ, కడవకొల్లు రాజేష్, వరిగంజికిషోర్, తాడిశెట్టి శ్రీను,తవ్వా కాసులు పాల్గొన్నారు.

ఇంకా అద్దెభవనంలోనే..

● వేలేరు అద్ద రోడ్డులో అద్దె భవనంలో నిర్వహిస్తున్న సర్కిల్ కార్యాలయం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతో నూతన భవనం సమకూరినా దానిని ప్రారంభించడానికి అధికారులు మీనమేషాలు లెక్కించడంతో దాదాపు మూడు దశాబ్ధాలుగా హనుమాన్‌జంక్షన్ సర్కిల్ పోలీస్ కార్యాలయం అరకొర సౌకర్యాల నడుమ అద్దె భవనంలో కాలం వెళ్లదీస్తోంది. సుదీర్ఘకాలంగా సొంత భవనంలేక ఇబ్బంది పడింది. గత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏఎన్ నరసింహమూర్తి చొరవ తీసుకొని దాతల నుంచి దాదాపు రూ.60లక్షలు విరాళాలు సేకరించి ఆధునిక హంగులతో రెండంతస్తుల భవనం నిర్మించారు. 2023 మే31న అప్పటి ఎస్పీ జాషువా భూమి పూజ నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి నిర్మాణం పూర్తి చేశారు. అప్పటి వైసీపీ నాయకులు నిర్మాణ కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఆ తరువాత వచ్చిన ఎస్పీ నయీం ఆస్మి ప్రారంభిస్తారని అనుకున్నారు. ఈ లోగా ఎన్నికలు రావడంతో ఆ ఊసే మరిచారు. ఇప్పుడు ఉన్న ఎస్పీ రెడ్డి గంగాధరరావుకు దీనిపై దృష్టి లేనట్లు కనిపిస్తోంది. సొంత భవనం సమకూరి దాదాపు 10 నెలలు అవుతున్న ప్రారంభించడానికి ఇంకా ప్రతిష్టంభన నెలకొంది. దాతల సహకారంతో శాశ్వత భవనం సాకారమైనా ప్రారంభించడానికి జాప్యం ఏమిటో అర్థం కాదు. విరాళాలు సేకరణలో అవకతవకలు చోటు చేసుకున్నాయనే విమర్శలు నేపథ్యంలో సరైన నిర్ణయం తీసుకోవడానికి అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. మరో పక్క సీఆర్డీయే అనుమతి లేకుండా భవనం నిర్మించారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి .కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ప్రాంభించడానికి జాప్యం వహించడం వెనుక జిల్లా పోలీసు ఉన్నతాధికారుల అంతర్యం ఏమిటో ప్రజల్లో అయోమయం నెలకొంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని నూతన భవనం ప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకొని సీఐ కార్యాలయాన్ని అద్దె చెర నుంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



నూతనంగా నిర్మించిన సర్కిల్ పోలీస్ కార్యాలయం



అద్దె భవనంలో నిర్వహిస్తున్న సర్కిల్ కార్యాలయం

నేత్ర వ్యాధులపై అవగాహన

పెనమలూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పురుషుల్లో కంటే స్త్రీలలో ఏభై నుంచి అరవై శాతం వరకు అనేక రకాల కంటి వ్యాధులకు గురవుతున్నారని, వారిలో చాలా మంది జీవ సంబంధమయిన, హార్మోన్ల కారణంగా ప్రభావితమవుతున్నారని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సౌజన్య తెలిపారు. గురువారం విజయవాడలోని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి ఆవరణలో డాక్టర్ సౌజన్య మహిళలను ప్రభావితం చేసే ప్రధాన లోపాల పట్ల అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయడం, ఆరోగ్యకరమైన జీవన శైలిని నిర్వహించడం, యూవీ-రక్షిత సన్ గ్లాసెస్ ధరించడం, మధుమేహం రక్తపోటు వంటి పరిస్థితులను అదుపులో ఉంచడం ద్వారా మహిళలు కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి : రాజ

కంకిపాడు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నియోజకవర్గంలో శుక్రవారం జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెనమలూరు మండలంలోని గంగూరు, కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లు గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక జనసేన నాయకులు బోయిన నాగరాజు, సుంకర శివ, పచ్చిపాల శేకర్, జక్కా రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆస్తుల పరిరక్షణే ధ్యేయం

ఉంగుటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ ప్రైవేటు భూముల పరిరక్షణతోపాటు ప్రజల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించటమే ధ్యేయంగా ప్రభు త్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జాలాది విమలకుమారి అన్నారు. రెవెన్యూ, అనుబంధశాఖల ఆధ్వర్యంలో మండలంలోని తరిగొప్పల, తరిగొప్పలకండ్రికలో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తరిగొప్పల పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ యాండ్రపు అనిత అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు తమ భూములు, స్థలాలకు సంబంధించి ఏవిధమైన సమస్యలున్నా రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవటం ద్వారా శాశ్వత పరిష్కారం పొందవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వై.అనిత, ఆర్ఐ బి.సూర్యకాంతి, మండల ఎండోమెంట్ ఆఫీసర్ ఈవీ ప్రసాదరావు, వీఆర్వోలు ఏ.చైతన్యకుమార్, వి.గాబ్రియేలు, గ్రేడ్-1పంచాయతీ సెక్రటరీ యోహాన్,పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ విమలకుమారి

హనుమాన్‌జంక్షన్‌రూరల్:భూములకు సంబంధించి సర్వే, పేర్లు తదితర సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించేందుకు గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహి స్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగభూషణం సూచించారు. కొయ్యూరు సర్పంచ్ కొల్లి వీరవెంకట సత్యన్నారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆధార్ అనుసంధానంలో తప్పులపై 2 ఫిర్యాదులు, రీసర్వే కొలతపై ఒక ఫిర్యాదు అందినట్లు వీఆర్వో తేరేజమ్మ వివరించారు. సర్వేయర్ వినోద్ పాల్గొన్నారు.

చివరి భూముల నీటితడులకు సాగు నీరందించాలి

● డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వరిసాగు ఆలస్యమైన కారణంగా మరో రెండు తడులు ఇవ్వాల్సిన అవసరముందని, సహకరించాలని కృష్ణా తూర్పు డెల్టా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొడాలి బాబును డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ కోరారు. కాకులపాడు చానల్ డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ గురువారం విజయవాడలోని జలవనరులశాఖ కార్యాలయంలో కృష్ణా తూర్పు డెల్టా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొడాలి బాబును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వచ్చే సీజన్ నాటికి కాలువల నిర్వహణ, అభివృద్ధికి సహకారమందించి చివరి భూములకు కూడా సకాలంలో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. సానుకూలంగా స్పందించిన ఈఈ బాబు తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని, రైతుల సమస్యలను ప్రత్యేకంగా ఉన్నతాధికారులకు తెలియజేసి వచ్చే సీజన్ నాటికి సాగుకాలువల ద్వారా సాగునీరందేలా కార్యాచరణ చేస్తామని హామీ ఇచ్చినట్లు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ తెలిపారు.



బాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజేష్

రెండవ రోజుకు చేరిన రిలే దీక్షలు

గన్నవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గన్నవరం అయోధ్య అపార్టుమెంట్ నిర్మాణంలో కార్మికులకు కావాల్సిన రూ.4కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 23వ రోజుకు చేరాయి. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుచరుల్లో ఒకరైన గుర్రం అంజయ్య(నాని) నాలుగేళ్ల పాటు పనులు చేయించుకుని డబ్బులు ఇచ్చేసరికి ఇవ్వాల్సిన పని లేదంటూ భయభ్రాంతులకు గురి చేశారని మేస్త్రీలు రామ్మోహనరావు, సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్లుగా కార్మికుల కష్టార్జితాన్ని ఇవ్వకుండా తమపై ఎదురు దాడికి దిగారంటూ ఆరోపించారు. తమ కింద పని చేసిన కూలీలకు పూర్తిగా డబ్బులు చెల్లించకపోవటంతో ఇళ్లకు వచ్చి గొడవలు చేస్తున్నారని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితిలో కుటుంబ సభ్యులతో కలసి ఆందోళన చేయాల్సి వచ్చిందని తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకూ దీక్షలు ఆపబోమని స్పష్టం చేశారు. బాబు, తేజ, వెంకన్న, హసీనా, ప్రసన్న, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్ష చేస్తున్న బాధిత కార్మికులు

అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని నిరసనలు

గన్నవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అహంకార వ్యాఖ్యలు చేసిన మతోన్మాద అమిత్‌షాను వెంటనే పార్లమెంట్ సభ్యత్వం నుంచి తొలగించాలని డీబీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య పార్క్ దగ్గర గురువారం అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కుల, మత అహంకారంతో అంబేడ్కర్ ఏమైనా దేవుడా ఆయనను పదేపదే స్మరిస్తున్నారని అనడం సరికాదన్నారు. ప్రధాని మోదీ అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి సస్పెండ్ చేసి 145 కోట్ల మంది ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఏంజెల్ విజయకుమార్, నందం ప్రసాద్, బాపట్ల రవి, విజయ్‌కుమార్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డీబీపీఎస్ నాయకులు

కంకిపాడు: రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పై చర్యలు తీసుకోవాలి సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడంకి నరేష్ మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ను పదే పదే విమర్శించటం సిగ్గు చేటన్నారు. తక్షణం అమిత్‌షా పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై. జోజి, వి. మరియదాసు, బి. బాబూజి, పి. జోజి, రాజకుమార్, కిరణ్, చంటి, క్రాంతి పాల్గొన్నారు.

బీసీలను దూరం చేసేందుకే కుట్ర : దండమూడి

ఉయ్యూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుండి వెన్నుముఖగా ఉన్న బీసీలను పార్టీకి దూరం చేయాలన్న వైసీపీ కుట్రను తిప్పికొట్టాలని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. నూజివీడులో ఇటీవల స్వాతంత్ర సమర యోధుడు సర్దార్ గౌతులచ్చన్న విగ్రహావిష్కరణ సందర్భంగా జరిగిన సంఘటన పై గండిగుంటలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన స్పందించారు. గౌడ సామాజిక వర్గం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన లచ్చన్న విగ్రహావిష్కరణకు గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, లచ్చన్న మ నుమరాలు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు హాజరయ్యారన్నారు. మంత్రులు, అధికారపార్టీ నాయకులు కార్యక్రమానికి హాజరవుతుంటే విపక్ష నేతలు సహజంగా హాజరు కారన్నారు. టీడీపీ, బీసీల్లో పట్టుఉన్న ఈ నాయకులపై బురదచల్లడం ద్వారా టీడీపీ అధిష్టానం దీన్ని సీరియస్‌గా తీసుకుని వీళ్లపై చర్యలు తీసుకుంటుందనేది వైసీపీ అధిష్టానం పన్నిన కుట్రని ఆరోపించారు. అందులో భాగంగనే పార్టీ పెద్దల సూచన మేరకు మాజీ మంత్రి జోగి రమేశ్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సన్నివేశాల్ని చిత్రీకరించి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆ పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులతో పోస్టింగ్‌లు పెట్టించి వైరల్ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాదృచ్ఛికంగా ముగ్గురు నాయకులు విగ్రహావిష్కరణకు హాజరయ్యారని, దీనిపై పార్టీ అధిష్టానం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆలోచించాలని కోరారు.

సీఎం దృష్టికి హైటెన్షన్ స్తంభాల సమస్య

విజయవాడ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలంలో రైతులకు సమాస్యాత్మకంగా మారిన హైటెన్షన్ విద్యుత్ స్తంభాల మార్పు సమస్యను విజయవాడ రూరల్ మండలం రైతులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. గురువారం వారు స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో అమరావతిలోని సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రిని కలసి తమ సమస్యను వివరించారు. అనుమతులు లేకుండా తమ పొలాల్లో మెగా కంపెనీ తవ్వకాలు చేపడుతోందని ఆ కారణంగా తాము నష్టపోతున్నామని తెలిపారు. పశ్చిమ బైపాస్ పనుల కోసం తాము అడ్డంకి కాదన్నారు. ఎన్‌హెచ్, ల్యాంకో, మెగా కంపెనీలు స్వలాభం కోసం తమను ఆర్థికంగా ఇబ్బందుల పాల్జేస్తున్నారని వివరించారు. రైతుల సమస్యలపై స్పందించిన చంద్రబాబు సీఎం పేషీలోని ముగ్గురు ఐఏస్ అధికారులు, ఎన్‌హెచ్ అధికారులు, రైతులతో కమిటీ వేయాలని ఆదేశించారు. కమిటి ద్వారా ప్రత్యామ్నాయాలను చూడాలని సూచించారు. అల్లూరు వెంకట సత్యనారాయణ, రావి శివరామకృష్ణ, సాంబయ్య, తదితరులు ముఖ్యమంతిని కలిసినవారిలో ఉన్నారు.

జంక్షన్‌లో ఆక్రమణల తొలగింపు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జంక్షన్‌లో పాదచారులు, వాహన చోదకులకు ఇబ్బందిగా మారిన ఫుట్‌పాత్, రోడ్డు మార్జిన్ ఆక్రమణలపై బాపులపాడు గ్రామ పంచాయతీ గురువారం చర్యలు చేపట్టింది. పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పోలీస్ బందోబస్తు సహకారంతో విజయవాడ రోడ్డులో రెండు వైపులు, నూజివీడు రోడ్డులో గ్రామం పరిధిలో ఆక్రమణలు తొలగించారు. ఫుట్‌పాత్, రోడ్డుమార్జిన్‌లపై ఉన్న సైన్ బోర్డులు, వసారాలు, స్టాల్స్ మాత్రమే తొలగించారు. డ్రెయినేజీపై ఉన్న ఆక్రమణలు జోలికి పోకుండా తొలగింపు చర్యలు నిర్వహించారు.



ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

టైర్స్ అండ్ సర్వీస్ ఫ్రాంఛైజ్ ప్రారంభం

గన్నవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని ఎంఆర్ఎఫ్ టైర్స్ రీజనల్ సేల్స్ మేనేజర్ రేణు వర్గీస్ అన్నారు. జాతీయ రహదారి వెనుక ప్రసన్నాంజనేయ టైర్స్ అండ్ సర్వీస్ ఫ్రాంఛైజ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో రోడ్లు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. డిప్యూటీ మేనేజర్ ఈశ్వర్, భరత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

21న సర్వసభ్య సమావేశం

ఉంగుటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 21న మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ వి.సరోజినీ అధ్యక్షతన స్థానిక స్త్రీశక్తి భవనం మీటింగ్ హాలులో జరుగుతుందని ఎంపీడీవో ఈ.సత్యకుమార్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ పనులపై స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆయాశాఖల అధికారులతో సమీక్షించి తీర్మానాలు చేయటం జరుగుతుందన్నారు. అన్నిగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు అన్నిప్రభుత్వశాఖల అధికారులందరూ హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

భయాందోళన చెందొద్దు : యార్లగడ్డ

గన్నవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారులు ఫారెస్టు ప్రాంతాల్లో రెగ్యులర్‌గా పర్యటించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. మండలంలోని మెట్లపల్లిలో చిరుతపులి మృతి చెందటంపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్పందించారు. ప్రజలు భయాందోళన చెందవద్దని భరోసా కల్పించారు. అటవీ శాఖ అధికారులు పులుల సంచారంపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ ప్రాంతంలో, తోటల్లో పులి, వన్యప్రాణుల పాద ముద్రలు కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉంటానని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన చేశారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం

కంకిపాడు : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో డీఆర్పీ, కేఆర్పీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి నూతన విద్యా విధానంలో వస్తున్న మార్పులు కనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఎంఈవో ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు బి. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా జయప్రదం చేయాలి

ఉయ్యూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మచిలీపట్నంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్ర వారం తలపెట్టిన ధర్నా జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నాయకుడు సిద్దినేని ప్రసాద్ పిలుపునిచ్చారు. కార్మికులకు క్లైమ్‌లు మంజూ రుచేసి అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లు పరిష్కరిం చాలని జరుప తలపెట్బిన ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం ఉయ్యూరులో కరపత్రాలు పంపిణీ చేశారు. సీఐటీయూ నాయకుడు బి.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీచేస్తున్న నేతలు

టీడీపీ సభ్యత్వ నమోదు

పెనమలూరు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. గురువారం కానూరులో టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు ఆధ్వర్యంలో, యనమలకుదురు ఎన్టీఆర్ గార్డెన్స్ వద్ద మొక్కపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద రఫీ, రియాజ్, జానీ, అఖిల్, బలగం కొండ తదితరులు పాల్గొన్నారు.

మారని రైతుభరోసా కేంద్రం

గండిగుంట(ఉయ్యూరు), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైసీపీ అధికారంలో ఉండగా ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా కొన్నిచోట్ల అదే పేరుతో ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సహాయ కేంద్రాలుగా పేరు మార్చినప్పటికి గండిగుంటలో భవనంపై రైతుభరోసా కేంద్రంగానే ఉంది.



పరాయివారిదే కిరాయి

చేతివృత్తుల్లో యూపీ, ఎంపీ, ఒడిశా, బిహారీలదే రాజ్యం

- కూలీపనుల్లోనూ ఇతర రాష్ట్రాల వారే
- పని గంటలు, వేతనాలు, సెలవుల్లో తీవ్ర వ్యత్యాసం
- మనవాళ్లతో పోలిస్తే ఇతర రాష్ట్రాల కూలీలతోనే అధిక లాభాలు
- వృత్తి నైపుణ్యం కూడా వాళ్లకే ఎక్కువ
- అందుకే వాళ్ల వైపే మొగ్గు చూపుతున్న వ్యాపారులు, బిల్డర్లు

వడ్రంగి, చెప్పుల తయారీ, కుమ్మరి, కమ్మరి, సెలూన్, తాపీ పని, మట్టిమోత పని ఏదైనా అనాదిగా మన తెలుగు రాష్ట్రాల్లో కులవృత్తులుగా చెలామణి అవుతున్నాయి. ఒక్కోపనిని ఒక్కో కులం చేతి వృత్తిగా భావించి ఆయా పనులను చేస్తూ పొట్టపోసుకుంటున్నారు. ఇక బీరువాలు, మంచాల తయారీ పనులు కూడా చాలామందికి చేతి వృత్తులుగా ఉన్నాయి. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు మన తెలుగు వాళ్లు నెమ్మదిగా చేతివృత్తులు, కులవృత్తులకు దూరమవుతున్నారు. ఆయా కుటుంబాల్లో యువత చదువుకుని ఉండటం, నూతన పోకడల కారణంగా చేతి వృత్తులపై మొగ్గుచూపడం లేదు. దీంతో ఇతర రాష్ట్రాల కూలీలు ఆ లోటును భర్తీ చేస్తున్నారు. నేడు తెలుగు రాష్ట్రాల్లో ఏ చేతి వృత్తి, ఏ కుల వృత్తిని చూసుకున్నా మన వాళ్లకన్నా పరాయి రాష్ట్రాల వారి సంఖ్య ఎక్కువ. ప్రధానంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, బిహారీలు ఆయా పనుల్లో నైపుణ్యం ప్రదర్శిస్తూ మన వాళ్లకు పోటీ ఇస్తున్నారు అనడం కన్నా పక్కన పెట్టేశారని చెప్పవచ్చు.- అజిత్‌సింగ్‌నగర్, ఆంధ్రజ్యోతి

మనవాళ్లు కుల వృత్తులకు, చేతి వృత్తులకు దూరం కావడంతో ఇతర రాష్ట్రాల కార్మికులు ఆయా వృత్తుల్లో స్థిరపడుతున్నారా లేక వాళ్లు రావడం వలన మనవాళ్లకు పని లేకుండా పోతోందా అనే విషయం పక్కన పెడితే మన తెలుగు వాళ్లకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలకు అనేక విషయాల్లో తీవ్ర వ్యత్యాసం ఉంది. ఇతర రాష్ట్రాల కూలీలు చేసే పని గంటలు ఎక్కువ, సెలవుదినాలు తక్కువ. వేతనాల్లోనూ తక్కువకే పనిచేస్తున్నారు. దీంతో అనేక మంది చిన్నా, పెద్ద పరిశ్రమలు నిర్వహించే వ్యాపారులు, బిల్డర్లు ఇతర రాష్ట్రాల కూలీలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఉదాహరణకు తాపీ పని, మట్టి మోత పనులు తీసుకుంటే మన వాళ్లు ఉదయం 8.30కి పనికి ఎక్కితే మధ్యాహ్నం గంట విరామం తీసుకుని సాయంత్రం 6.00 గంటలకు దిగిపోతారు. ఇక వేతనం విషయానికి వస్తే రోజుకు మగవారికి రూ. 800 కూలీ ఉండగా ఆడవాళ్లకు రూ. 600 ఉంటుంది. ఇక సెలవు దినాల విషయానికి వస్తే వారంలో మనవాళ్లు పనిచేసేది 4 లేదా 5 రోజులు మాత్రమే. బిల్డర్ లేదా తాపీ మేస్త్రీ ఏదైనా పెద్ద పని ఒప్పుకుంటే మనవాళ్లతో ఆ పని సకాలంలో పూర్తి చేయలేమనే ఆపనమ్మకం ఏర్పడింది. అదే ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు బిల్డర్‌కు ఎప్పుడు కావాలంటే అప్పుడు అందుబాటులో ఉంటారు. ఉదయం 6 గంటలకు పని ఎక్కితే మధ్యాహ్నం భోజన విరామం మినహాయిస్తే రాత్రి 8గంటల వరకు పని చేస్తున్నారు. పైగా సెలవు అనే మాట వినపడదు. ఇక కూలీ విషయానికి వస్తే రోజుకు మగవారికి రూ.600 ఆడవారికి రూ.500 ఉంటుంది. అందుకే బిల్డర్లు, పరిశ్రమల నిర్వాహకులు పరాయి కూలీలపైనే ఆధారపడుతున్నారు.



కూలీల నుంచి సబ్ కాంట్రాక్టర్లుగా..

నిన్న మొన్నటి వరకు కూలీలుగా పనిచేసిన ఇతర రాష్ట్రాల కార్మికులు ఇప్పుడిప్పుడే సబ్ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని పరిశ్రమల్లో యజమాని నుంచి రోజువారీ వేతనం కాకుండా ఆర్డర్లు వచ్చిన పనుల్లో సబ్ కాంట్రాక్టులు తీసుకుని ఆయా రాష్ట్రాల నుంచి కార్మికులను మన రాష్ట్రానికి రప్పించుకుంటున్నారు. సెలవులు లేకుండా తక్కువ వేతనాలకు ఎక్కువ పనిదినాలు చేస్తూ యజమానికి లాభాలు తెచ్చిపెడుతుండటంతో చాలా మంది ఇతర రాష్ట్రాల కార్మికులవైపే మొగ్గుచూపుతున్నారు.

పేదరికం కూడా కారణమే: సీహెచ్ బాబూరావు

మన రాష్ట్రంతో పోలిస్తే యూపీ, బిహార్, ఒడిశా అభివృద్ధిలో కాస్త వెనుకపడి ఉన్నాయి. దీంతో ఆయా రాష్ట్రాలో ఉపాధి లేక కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా అనేక మంది రాష్ట్రంలో తక్కువ జీతాలకు పనిచేస్తూ ఎక్కువ శ్రమ చేస్తున్నారు. వీరికి కూడా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలి.

ప్రశ్నించే గుణం మనవాళ్లలో ఎక్కువ: దోనేపూడి శంకర్

తెలుగు రాష్ట్రాల్లో కార్మికులకు ప్రశ్నించే గుణం ఎక్కువ, అందుకే మన వాళ్లు వెనుకబడిపోతున్నారు. ఇతర రాష్ట్రాల కూలీలు చెప్పిన పని ప్రశ్నించకుండా పూర్తి చేస్తున్నారు. అందుకే చాలాచోట్ల వారే ఎక్కువ. ప్రమాదవశాత్తు ఎవరైనా ఇతర రాష్ట్ర కూలీ చనిపోతే చిన్నమొత్తంలో ఇచ్చి సరిపెట్టేస్తున్నారు. అదే మనవాళ్ల విషయంలో కుదరదు. అందుకే అందరూ ఇతర రాష్ట్రాల కూలీలపై ఆధారపడుతున్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు నకిలీలు పోలీసులు

- బంగారం షాపు గుమస్తాను బెదిరించి రూ.26లక్షల దోపిడీ
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

వన్‌టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేటలోని ఓ బంగారు ఆభరణాల షాపులో పనిచేస్తున్న గుమస్తాను పోలీసులమని చెప్పి ముగ్గురు అతడిని బెదిరించి కారులో కిడ్నాప్ చేసి రూ.26లక్షలు దోచుకున్న సంఘటన బుధవారం రాత్రి జరిగింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వన్‌టౌన్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు నకిలీ పోలీసులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. జగ్గయ్యపేటలోని బంగారు ఆభరణాల షాపు నిర్వహిస్తున్న సాయి వద్ద రామకృష్ణ గుమస్తాగా పనిచేస్తున్నాడు. యజమాని సాయి ఇతర ప్రాంతాల్లో బంగారం కొనుగోలు చేయటానికి గుమస్తా రామకృష్ణకు డబ్బులిచ్చి పంపిస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారి సాయి బుధవారం రామకృష్ణకు సుమారు రూ.26లక్షల నగదు ఇచ్చి చెన్నైలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేయించటానికి విజయవాడకు పంపించారు. అయితే రామకృష్ణ జగ్గయ్యపేట నుంచి విజయవాడకు ఓ కారులో ప్రయాణించాడు. ఖుద్దూస్ నగర్ ఎర్రకట్ట వద్ద రాత్రి 11 గంటలకు ముగ్గురు వచ్చి తాము పోలీసులమంటూ రామకృష్ణ ప్రయాణిస్తున్న కారును ఆపారు. కారు నుంచి బయటకు దిగిన రామకృష్ణను వేరే కారులో ఎక్కించుకుని కేదారేశ్వరపేటలోని ప్రభాస్ కాలేజీ సమీపంలోకి తీసుకువచ్చి కారును ఆపి రామకృష్ణను కారులో కూర్చోపెట్టి సీఐతో మాట్లాడి వస్తామని బయటకు వెళ్లారు. కొద్దిసేపటి తరువాత రామకృష్ణ వద్దకు వచ్చి బెదిరించి, కొట్టి అతడి వద్ద ఉన్న రూ.26లక్షలు నగదు తీసుకుని పరారయ్యారు. బాధితుడు అక్కడ నుంచి వెళ్లి సత్యనారాయణపురం పోలీసులను ఆశ్రయించాడు. సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఆ ముగ్గురిని తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఈ ముగ్గురు నకిలీ పోలీసులు ఇంకా ఎక్కడెక్కడ నేరాలు చేశారన్నదానిపై సీసీఎస్ సీఐ పెద్ది శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

ఇంటి వద్దకే పార్శిల్ డెలివరీ

బస్టేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాజిస్టిక్స్ ద్వారా ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు ఇంటి వద్దకే పార్శిల్ డెలివరీ ఇవ్వబడునని ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణ అధికారి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. 2017లో ప్రారంభమైన ఏపీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ దినదినాభివృద్ధి చెందుతూ వినియోగదారుల మన్ననలను పొందిందన్నారు. ప్రతి ఏడాది డోర్ డెలివరీ మాసోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అందుకే ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు 80 ప్రధాన నగరాలు, ముఖ్య పట్టణాల్లో 50 కేజీల వరకున్న పార్శిళ్లను ఇంటి వద్దకే డెలివరీ చేయబడుతుందని తెలిపారు. 5 కిలోమీటర్ల లోపున్న కేజీ పార్శిల్‌కు రూ.17.70, 6 కేజీల వరకు ఉన్న పార్శిల్‌కు రూ.35.40, 10 నుంచి 25 కేజీల వరకు పార్శిల్‌కు రూ.47.20, 25 నుంచి 50 కేజీల వరకున్న పార్శిల్‌కు రూ.50ల చార్జీలు వసూలు చేస్తున్నట్టు తెలిపింది. 10 కిలోమీటర్ల లోపున్న కేజీ పార్శిల్‌కు రూ.21.24, కేజీ నుంచి 6 కేజీల వరకున్న పార్శిల్‌కు రూ.42.48, 10 నుంచి 25 కేజీలున్న పార్శిల్‌కు రూ.61.36, 25 నుంచి 50 కేజీలున్న పార్శిల్‌కు రూ.76.70 వసూలు చేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని ఆ ప్రకటనలో కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయుడు

లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర లారీ యజమానుల సంఘం

లబ్బీపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాల కన్నా మన రాష్ట్రంలో పన్నులు అధికంగా ఉండటంతో ఏటా లారీ యజమాని ఒక్కో వాహనానికి రూ.2లక్షల వరకు నష్టపోతున్నాడని రాష్ట్ర లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం గురువారం బెంజి సర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీ యజమానులు పక్కరాష్ట్రాల్లో డీజిల్ కొనుగోలు చేయడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోల్పోతున్న అంశాన్ని పరిగణలోనికి తీసుకోవాలన్నారు. అనంతరం ఏపీ లారీ ఓనర్స్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గ్రీన్‌టాక్స్ తగ్గిస్తామని, కాంపౌండింగ్, చలానా సమస్యలు పరిష్కరిస్తామని కూటమి ఇచ్చిన హామీ నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ పోర్టల్ ఈ-ప్రగతిని కేంద్ర వాహన్‌లో కలిపినందున అప్ లోడింగ్ పరంగా తీవ్ర జాప్యం జరిగి లారీ యజమానులు ఇబ్బంది పడుతున్నారన్నారు. టోల్ గేట్ రేట్లు ఏటా 7శాతం పెంచడంలో హేతుబద్ధత లేదన్నారు. వాహన్‌లో వస్తున్న కేసులన్నింటినీ మార్చి 31వరకు వాయిదా వేసి ఆర్టీవో ఆఫీసులోని పనులకు ఆటంకం కలగకుండా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. వివిధ జిల్లాల నుంచి లారీ యజమానుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ ఇవ్వాల్సిందే..!

- ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్

బస్టేషన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన, చేయనున్న ప్రజా రవాణ సంస్థ ఉద్యోగులకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హయ్యర్ పెన్షన్ ఇవ్వాల్సిందని, దీని అమలుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని ప్రజా రవాణ సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ గురువారం ఎండీ ద్వారకా తిరుమలరావు, పరిపాలనా విభాగం ఈడీ రవివర్మకు లేఖలు ఇచ్చారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య గురువారం ఒక ప్రకటన చేశారు. చిన్న చిన్న కారణాలపై పెన్షన్ దరఖాస్తులను తిరస్కరించకుండా ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారాన్ని తెప్పించుకుని పెన్షన్ మంజూరు ప్రాసెస్‌ను ఆలస్యం లేకుండా చేయాలన్నారు. హయ్యర్ పెన్షన్ డిమాండ్ నోటీస్‌లను డౌన్‌లోడ్ చేసుకోవటం తెలియని వారికి తిరిగి అవకాశం కల్పించాలని, వారికి మళ్లీ రిమాండ్ నోటీసులివ్వాలని కోరారు. హయ్యర్ ఎక్కువ వేతనాలపై రికవరీ ఆప్షన్ ఇచ్చి, ఆ మేరకు రికవరీలు చేయించుకుని పెన్షన్ ఫండ్‌కు రికవరీలు పంపినా సరే, ఆమోదం పత్రం లేదని దాదాపు 150 మంది ఉద్యోగులకు పెన్షన్ పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉందని, దీనికి పీఎఫ్ ట్రస్ట్ బాధ్యత తీసుకుని పరిష్కరించాలని కోరారు. 2013, 2017, 202లో బకాయిల చెల్లింపులు ఇతర లబ్ధి ఆలస్యంగా జరిగిందని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా పెన్షన్‌ను లెక్కించినందున సుమారు రూ.500 నుంచి రూ.1000 వరకు నష్టపోతున్నారని దీన్ని సవరించి చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఆర్టీసీ పీఎఫ్ ట్రస్ట్‌లో నిత్యం వస్తున్న సమస్యల పరిష్కారానికి, పెరిగిన పని భారానికి అనుగుణంగా గుమస్తాలను నియమించాలన్నారు. అన్ని యూనియన్‌లకు, అసోసియేషన్‌లకు డిమాండ్ నోటీసుల వివరాలు వాట్సాప్‌లో పంపించేలా ఏర్పాటు చేయాలన్నారు.


మినుము నూర్పిడి మిషన్ బోల్తా, కూలీ మృతి

- మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు

తోట్లవల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మినుము నూర్పిడి మిషన్ బోల్తా పడి మహిళా కూలీ యాదనాల లక్ష్మీ (46) మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం చాగంటిపాడు శివారు పిల్లివానిలంకలో జరిగింది. చాగంటిపాడుకు చెందిన లక్ష్మీ, నిమ్మకూరి నాగమ్మ, నందేటి శిరీష మొత్తం 10 మంది కూలీలు మినుము నూర్పిడి పనులకు ముఠాగా ఏర్పడి భీమవరపు భగవాన్‌రెడ్డి మిషన్ వెంట వెళుతున్నారు. గురువారం ఉదయం నుంచి మినుము నూర్పిడి పనులు చేసి సాయంత్రం 6.30 గంటల సమయంలో మరో రైతు పొలంలోకి మిషన్‌పై వెళుతున్నారు. కోతకు గురైన రోడ్డు మార్జిన్‌లో మినుము మిషన్ పడి అదుపుతప్పి బోల్తా కొట్టింది. మిషన్ కింద యాదనాల లక్ష్మీ, నిమ్మకూరి నాగమ్మ, నందేటి శిరీష పడిపోగా మిగతావారు చెల్లాచెదురుగా పడిపోయారు. పరిసర రైతులు, ప్రజలు వచ్చి మిషన్ కింద పడిన వారిని బయటకు తీయగా యాదనాల లక్ష్మీ ప్రాణాలు కోల్పోగా నాగమ్మ, శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ వై చిట్టిబాబు, స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతురాలి భర్త లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

పాతికేళ్ల శ్రమ నూరేండ్ల నా ఊరు

- పల్లె తెల్లారేది పాటతోనే... ● ఆర్డినరీ బస్సులు, పాసింజర్ రైళ్లు నా పాటకు పునాదులు
- ఆంధ్రజ్యోతితో జానపద గాయకుడు, గేయ రచయిత వరంగల్ శ్రీనివాస్



పోలీసు కుటుంబంలో జన్మించిన ఆయన ఫోక్ రైటర్ అయ్యారు. తర్వాత జానపద గాయకుడిగా మారారు. తెలుగు భాషలోనే కాకుండా అస్సామీ మీమీ, ఒడియా, మరాఠీ భాషల్లో జానపదులను జత వేసే స్థాయికి ఎదిగారు. ఆయనే సినీ గేయ రచయిత, జానపద గాయకుడు వరంగల్ శ్రీనివాస్. తెలంగాణ సమాచార పౌర సంబంధ శాఖలో ఉద్యోగం చేస్తూ జానపదాన్ని, పల్లె సాహిత్యాన్ని పెంచుతున్నారు. ఆయన రచించిన గేయ కావ్యం 'నూరేండ్ల నా ఊరు' ఆడిషన్స్ కోసం విజయవాడకు వచ్చారు. ఈ సందర్భంగా వరంగల్ శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.
- ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్

ఏమిటీ గేయకావ్యం నేపథ్యం..?

ఒకప్పుడు పల్లెలు, అక్కడి మనుషులు, వారి మనస్సులు, పల్లెలకున్న పేర్లు, అక్కడ ఇప్పుడున్న పరిస్థితులను ఊశాక నూరెండ్ల నా ఊరు గేయకావ్యం ప్రాణం పోసుకుంది. దీని రచన 25 ఏళ్లపాటు సాగింది. నేను ఉమ్మడి వరంగల్ జిల్లా దామెర మండలం తక్కెళ్లపాడు గ్రామంలో జన్మించాను. నాన్న నరసయ్య పోలీసు కానిస్టేబుల్. బయన బదిలీ అయినప్పుడు వరంగల్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉండేవాళ్లం. దీంతో మేం ఉంటున్న ప్రాంతానికి చుట్టూ అక్కడున్న పల్లెలు, వాతావరణం బాల్యం నుంచి చూశాను. ఒక రోజు నా కుటుంబంతో కలిసి ఏటూరునాగారం వెళ్తున్నప్పుడు చినబోయినపల్లె గ్రామం పేరు బోర్డుపై కనిపించింది. అసలు పల్లె చినబోవడం ఏమిటన్న ప్రశ్న అప్పుడే నాలో మొదలైంది. మేము వరంగల్ నుంచి ఊరు వెళ్తున్నప్పుడు మా అబ్బాయి పొలంలోకి వెళ్లి మొక్కజొన్న కండె తీసుకున్నాడు. దాని యజయాని తిట్టాడు. నా చిన్నప్పుడు రైతులు పిలిచి మరీ కండి కాల్చి ఇచ్చేవారు. గ్రామాల్లో అప్పటికీ, ఇప్పటికీ వచ్చిన మార్పులతో 'నూరెండ్ల నా ఊరు' గేయ కావ్యాన్ని రాశాను. ఓయమ్మ నా పల్లెసీమ ఎందుకింత చిన్నబాయె... ఎనకటికల తప్పినాదో నాపల్లె ఎటుగానీ తీరయినాదో...' పల్లవితో పాటను రాశాను. ఇందులో మొత్తం 243 చరణాలుంటాయి.

243 మంది గాయకులు ఎందుకు..?

పాటకు ప్రాణం అమ్మ పాడే జోలపాట. పాటతోనే పల్లెలకు తెల్లవారు పొద్దు వస్తుంది. బాలసంతు పాటతో పల్లెలు నిద్రలేస్తాయి. ఇలా మొదలయ్యే పల్లెకు పొద్దుపోవడం పాటతోనే జరుగుతుంది. బాలసంతు పాటల తర్వాత ఇళ్లలో అమ్మలు పనులు చేసుకుంటూ పాటలు పాడతారు. చివరికి సాయంత్రం సూర్యస్తమయమూ పాటతోనే జరుగుతుంది. పల్లెల్లో కలుపు తీసినా, నాట్లు వేసినా, కోతలు కోసినా, బండి కట్టినా, బంతి కొట్టినా పాటే. వీటిన్నింటిని చూసి అప్పటి, ఇప్పటి పరిస్థితులను పోల్చుతూ 243 చరణాలు రాశా. ఒక్కో చరణాన్ని ఒక్కో గాయకునితో పాడిస్తే బాగుంటుందని స్నేహితులు గూడూరు మహేష్, గాయకుడు జూపాల్ శివ సలహా ఇచ్చారు. అందుకే తెలంగాణ మొత్తం ఆడిషన్స్ నిర్వహించాం. ఆంధ్రప్రదేశ్‌లోను నిర్వహించాలని భావించా. రాయలసీమ, ఉత్తరాంధ్రలో పూర్తి చేశాం. 72 మంది గాయనీమణులు, 171 మంది గాయకులతో పాడించాలన్నది ఆలోచన.

జానపద గేయ రచయితగా ఎలా..!

నేను పాడడం కోసమే రాయడం మొదలుపెట్టా. పాడే అవకాశం రాకపోయినా రాయడం ఆపలేదు. వరంగల్‌లో ఏడో తరగతి చదువుతున్నప్పుడు ఇంటర్వెల్‌లో స్కూల్ నుంచి బయటకు వచ్చా. ఎదురుగా ఉన్న మొగిలయ్య ఆడిటోరియంలో పాటల పోటీల బ్యానర్ కనిపించింది. లోపలకు వెళ్లి 5 నిమిషాల్లో పాట రాశా. అదే నా మొదటి పోటీ, ప్రథమ బహుమతి వచ్చింది. అప్పటి నుంచి గేయరచనపై మరింత ఆసక్తి పెరిగింది. బాల్యంలో హమాలీలు, కార్మికులుండే ప్రదేశాలకు వెళ్లేవాడిని. వాళ్లు చెప్పుకునే కష్టాలు, వేసుకునే జోకులు వినేవాడిని. వరంగల్ నుంచి హైదరాబాద్‌కు ప్యాసింజర్ రైళ్లలో వెళ్తున్నప్పుడు, ఆర్డినరీ బస్సులో ఊరు వెళ్తున్నప్పుడు ప్రయాణికులతో మమేకమయ్యేవాడిని. వారిలో వివిధ రాష్ట్రాల వారుండేవారు. అక్కడి జానపదాల గురించి మాట్లాడేవాడ్ని. అలా అస్సామీ, ఒరియా, మరాఠీ, లంబాడీ, గోండు, కోయ, ఎరుక భాషల్లో జానపదాలపై పట్టు సాధించా.

తొలి పాట రాసిన చిత్రం..?

దాసరి నారాయణరావు నాకు మొదటిసారిగా సినిమాల్లో పాటలు రాసే అవకాశం ఇచ్చారు. ఆయన దర్శకత్వంలో రూపొందిన అడవి చుక్క చిత్రంలో 'ఎవరన్నారమ్మ మీరు గరీబోళ్లని...' , 'తయ్యాందత్తయ్...' గీతాలు రాశాను. తర్వాత ఆర్.నారాయణమూర్తి దర్శకత్వం వహించి, నటించిన చలో అసెంబ్లీ చిత్రంలో 'వవవ... విద్యార్థి వీధిన పడిపోతావన్న...' పాటను రాశాను. ఇవి కాకుండా ఆయుధం, అమ్మ మీద ఒట్టు, వీర తెలంగాణ, పోరు తెలంగాణ, వేగుచుక్కలు, ఊరు మనదిరా రెండేళ్ల తర్వాత సినిమాలకు పాటలు రాశాను. మొత్తంగా 50 చిత్రాలకు పాటలు రాసే అవకాశం వచ్చింది.

మీ జీవిత లక్ష్యం..?

నేను జానపద పాటలు రాయడం, పాడడం మొదలుపెట్టిన తర్వాత ఏదైనా ఒక సినిమాకు సంగీత దర్శకత్వం వహించాలన్నది లక్ష్యం. చనిపోయే లోపు ఒక సినిమాకు అయినా సంగీత దర్శకత్వం చేయాలనుకున్నా. ఆ కోరికను దర్శకుడు వి.సముద్ర తీర్చుతున్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న మూడు చిత్రాలకు సంగీతం సమకూర్చే అవకాశం ఇచ్చారు. ఇందులో రెండు చిత్రాలకు పాటలు నేను రాస్తున్నా. తెలుగు చిత్రసీమలో ఇటువంటి అవకాశం ఎవరికీ రాలేదు.



ఇందుపల్లి రైల్వేస్టేషన్ గేటువద్ద జరుగుతున్న ట్రాక్ మరమ్మతు పనులు, రైల్వేగేటు మూసివేత బోర్డు ప్రదర్శన

25 వరకు ఇందుపల్లి రైల్వేగేటు మూసివేత

ఉంగుటూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-గుడివాడ ప్రధాన రైల్వేమార్గంలో ఇందుపల్లి వద్ద ఉన్న రైల్వేస్టేషన్ గేటును గురువారం ఉదయం 7 నుంచి ఈ నెల 25న రాత్రి 7గంటల వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు సౌత్‌సెంట్రల్ రైల్వే (గుడివాడ) సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (ఎస్ఎస్ఇ) వై.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసరంగా రైల్వేస్టేషన్ గేటు వద్ద ట్రాక్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా వారంరోజులపాటు ఈ గేటు గుండా వాహనాల రాకపోకలను నిరవధికంగా నిలిపేస్తున్నట్టు తెలిపారు. తేలప్రోలు-నందమూరు ప్రధానరహదారిపై నిత్యం వివిధ వాహనాలపై రాకపోకలు సాగించే ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని సూచించారు.

ధాన్యం బస్తాల తరలింపులో రైతుల అవస్థలు

గురువారం ఉదయం 7గంటలకే రైల్వేగేటు మూసివేయడంతో ఈ మార్గం గుండా మిల్లులకు ట్రాక్టర్లు, లారీలపై ధాన్యపు బస్తాలను తరలించే రైతులు అవస్థలు పడ్డారు. ముందస్తు సమాచారం తెలియక ఉదయాన్నే ఈ మార్గంలో ప్రయాణాలు సాగించే ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు గేటు దాకా వెళ్లి అసహనంతో వెనుదిరిగారు. స్థానిక ఎస్సై యు.గోవిందు సిబ్బందితో కలిసి ఉదయం 9గంటల నుంచి ఉంగుటూరు, నందమూరు అడ్డరోడ్డు వద్ద బారికేడ్లు అడ్డుపెట్టి ట్రాఫిక్‌ను వెన్నూతల, మానికొండ మీదుగా మళ్లించారు. గేటుమూసివేతకు సంబంధించిన సర్క్యులర్ కాపీలను రైల్వే సిబ్బంది బుధవారం రాత్రి హడావుడిగా స్థానిక పంచాయతీ, ఆర్టీసీ, పోలీస్, ఎమ్మార్వో, ఇతర శాఖల అధికారులకు అందజేయడం, స్థానిక మీడియా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై రైల్వేఅధికారుల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు.

కన్నుల పండువగా శిడిబండి

పెడన, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పైడమ్మతల్లి జాతర ఉత్సవాలు గురువారం 6వ రోజుకు చేరాయి. కోలాహల వాతావరణంలో శిడిబండ్లను కన్నుల పండుగగా ఊరేగించారు. జాతర ఉత్సవాల్లో శిడిబండ్లకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కోర్కెలు తీరాలనుకుంటున్న వారు ఈ ఉత్సవాలో అమ్మవారికి శిడిబండ్లు కట్టి ఊరేగిస్తామని మొక్కుకుంటారు. తర్వాత ఉత్సవాల్లో శిడిబండ్లను ఊరేగించి మొక్కుబడులు తీర్చుకుంటారు. పూర్వం శిడిబండికి మనిషిని కట్టి ఊరేగించేవారు. బ్రిటీషు ప్రభుత్వ పాలనలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన అప్పటి కలెక్టర్ శిడిబండికి మనిషిని కట్టి ఊరేగించడం అనాగరికంగా ఉన్నందున మనిషికి బదులు బొమ్మలను కట్టి ఊరేగించాలని ఆదేశించారు. అప్పటి నుంచి శిడిబండ్లకు బొమ్మలను కట్టి ఊరేగిస్తూ వస్తున్నారు. జాతరలో ఇదే హైలెట్. 6వ రోజు జాతరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద సత్యల్యాబ్ అధినేత బూసం నాగగిరిధర్‌కుమార్, కాశీ అన్నపూర్ణ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈవో టీవీవీ మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావులు పర్యవేక్షించారు. ఉత్సవాలను పురస్కరించుకుని సీఐ కే నాగేంద్రప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పైడమ్మతల్లి సన్నిధిలో ఏసీ నూతక్కి

దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు గురువారం పైడమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో టీవీవీ మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు ఏసీకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం వెంకట సాంబశివరావు, ఈవో మోహనరావు, ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావుతో కలిసి ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతమయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తెప్పోత్సవ సమయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఉత్సవ ప్రాంగణాన్ని పరిశీలించి ఈవోకు సూచనలు చేశారు.

గుడివాడ

● గుడివాడ ● పామర్రు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	192
చికెన్ స్కిన్‌లెస్	202

సెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.610

మోటూరు హైస్కూల్‌లో పీడీని నియమించాలి

గుడివాడ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మోటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇద్దరు పీడీలకు గాను ఏడాదిన్నర నుంచి ఓ పీడీ డిప్యూటేషన్‌పై వేరే ప్రాంతంలో పనిచేస్తున్నారని, రెండో పీడీ ప్రసూతి సెలవుపై ఉన్నారని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.రంగబాబు తెలిపారు. విద్యార్థుల్ని ఆడించేవారు లేరని, అసెంబ్లీ నిర్వహించటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. పాఠశాలలో 200 మందికిపైగా విద్యార్థులు ఉన్నారని, వెంటనే జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలకు పీడీని నియమించాలని ఆయన కోరారు.

పనిచేసే ప్రభుత్వమిది

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



లక్ష్మీనరసింహాపురం సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నందివాడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పని చేసే ప్రభుత్వం అధికారంలో ఉందని, కావలసిన పనులు చేయించుకోవాలని లక్ష్మీనరసింహాపురం సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. భూమి ఉన్న ప్రతీ రైతు రెవెన్యూ సదస్సులు ఉపయోగించుకోవాలన్నారు. లక్ష్మీనరసింహపురం, ఇలపర్రు పరిధిలో ఎక్కువ శాతం బి-ఫారం భూములే అని, 40 ఏళ్లుగా సాగు చేసుకుని జీవిస్తున్నామని ఆ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించి పట్టాలు ఇప్పించాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. కలెక్టర్ బాలాజీతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, ఎంపీడీవో మల్లీశ్వరి, తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి, ఈవోపీఆర్డీ అమీర్‌బాషా, గణేష్, సర్పంచ్ మరియమ్మ, ఎంపిటిసి రంగమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు కృషి

గుడివాడ: పట్టణాభివృద్ధి, పారిశుధ్య మెరుగుదలకు కృషి చేస్తున్నామని, కొందరి నిర్లక్ష్యంతో కష్టం వృథా అవుతోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనంపై ఎమ్మెల్యే ఉదయపు పర్యటన నిర్వహించారు. క్షేత్రస్థాయిలో శానిటేషన్ సమస్యలపై మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో ఆయన మాట్లాడారు.

క్రిస్మస్..సర్వమానవాళికి శాంతి సందేశం

క్రిస్మస్ అంటే సర్వ మానవాళికి శాంతి సందేశమని, శత్రువు పట్ల కూడా క్షమాగుణం కలిగి ఉండాలని ఏసుక్రీస్తు సందేశం ఇచ్చారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. గుడ్‌మెన్‌పేటలోని జాకబ్ మెమోరియల్ చర్చిలో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బైబిల్ కళాశాల ప్రొఫెసర్ కొడాలి విజయకుమార్ క్రీస్తు సందేశాన్ని ఇచ్చారు. చర్చి నిర్వాహకులు పాస్టర్ వేశపోగు విజయబాబు ఆధ్వర్యంలో సమకూర్చిన నూతన వస్త్రాలను వృద్ధులు, చిన్నారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.



విన్నకోటలో తహసీల్దారుకు అర్జీలు ఇస్తున్న రైతులు

విన్నకోటలో పది అర్జీలు

గుడ్లవల్లేరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విన్నకోట పంచాయతీ కార్యాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పది మంది రైతులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు దాఖలు చేశారు. తహసీల్దారు లోకరాజు, సర్వేయర్ పర్వీన్ సుల్తానా పాల్గొన్నారు.

పైడికొండలపాలెంలో 7..

పమిడిముక్కల: పైడికొండలపాలెంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలతో పాటు ఇతర సమస్యలకు ప్రజల నుంచి ఏడు అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.జోబాబు, కె.ఏసుపాదం, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫీల్డ్ సొసైటీ భూములను దళితులకు పంచాలి : సీపీఎం

నందివాడ : ఇలపర్రు ఫీల్డ్ లేబర్ సొసైటీ భూమి 95 ఎకరాలు బీడీ భూమిగా ఉందని ఆ భూమిని ఇలపర్రు దళితులకు పంచాలని లక్ష్మీనరసింహాపురం రెవెన్యూ సదస్సులో సీపీఎం కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి వినతిపత్రం అందజేశారు. బుంగా మరియ దాసు, కొంగర మేరిమ్మ, రాంబాబు, యేసు, ఇలపర్రు గ్రామస్థులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ప్రారంభం నేడు

గుడివాడ రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బొమ్ములూరులో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తారని ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన సూచించారు.



అధ్వానంగా..

● కపిలేశ్వరపురం వద్ద మంటాడ- లంకపల్లి రోడ్డు

(ఆంధ్రజ్యోతి-పమిడిముక్కల): మంటాడ-లంకపల్లి ఆర్‌అండ్ బీ రోడ్డుపై కపిలేశ్వరపురం గ్రామం వద్ద గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడి, గాయాలపాలవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో వీరంకిలాకు నుంచి మంటాడ వరకు రోడ్డు వేసి కపిలేశ్వరపురంలో కొంతమేర వదిలివేశారు. గ్రామంలో కొంతమేర సిమెంట్ రోడ్డు వేసి నిధులు చాలక 150 మీటర్ల మేర వదిలివేశారు. అప్పటికే గుంతలమయంగా ఉన్న రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలవడ ంతో ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కార కోసం నిర్వహిస్తున్న ప్రజావేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్లు, రేషన్‌కార్డులు, పేదలకు నివేశన స్థలాలు ఇస్తుందని ఆయన తెలిపారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి పానుగంటి సందీప్, కాటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులకు అభినందనలు

రోలర్‌స్కేటింగ్ హాకీ జాతీయ పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 62 జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ హాకీ పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థులు ప్రతిభ కనబరచారని ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో క్రీడాకారులను ఆయన అభినందించారు. కెడిట్ 7-11 బాలికల విభాగంలో రాష్ట్ర జట్టు తరపున కె.కారుణ్యశ్రీ రజత పతకం, మిక్స్‌డ్ విభాగంలో కాంస్య పతకం, కెడిట్ 7-11 బాలికల విభాగంలో వి.వన్షిక రజత పతకం, జూనియర్ బాలికల విభాగంలో ఇ.నిఖిల కాంస్య పతకం సాధించారని ఆయన తెలిపారు. కోచ్ అయ్యప్ప, పతక గ్రహీతలను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సత్తా చాటిన స్టేడియం క్రీడాకారులు

తమిళనాడు, కోయంబత్తూర్‌లో ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన 62 రోలర్ స్కేటింగ్ హాకీ జాతీయ పోటీల్లో ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు ప్రతిభ కనబరచి, పలు పతకాలు సాధించారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్టేడియం కార్యాలయంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. కెడిట్ 7-11 బాలికల విభాగంలో రాష్ట్ర జట్టు తరఫున వి.ఆషిక, కె.కారుణ్యశ్రీ, బి.దివిష రాష్ట్ర జట్టుకు వెండిపతకం రావడంలో విశేష ప్రతిభ కనబరిచారని, కెడిట్ 7-11 మిక్స్‌డ్ బాలికల విభాగంలో రాష్ట్ర జట్టు తరఫున వి.ఆషిక, కె.కారుణ్యశ్రీ రాష్ట్ర జట్టుకు కాంస్య పతకాన్ని సాధించడంలో కృషి చేశారని తెలిపారు. కోచ్ వి.రాజా, పతక గ్రహీతలను సత్కరించారు. జాతీయ కోచ్‌గా నియమితులైన వి.రాజాను అభినందించారు. స్టేడి యం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, మేనేజర్ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.



బాడీ బిల్డింగ్ పోటీల్లో పతకాలు సాధించిన లిఫ్టర్లు

బాడీ బిల్డర్లకు అభినందన

గుడివాడ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 15వ తేదీ నిర్వహించిన ఉమ్మడి కృష్ణా బాడీ బిల్డింగ్ పోటీల్లో ఫిట్‌జోన్ బిల్డర్లు పలు పతకాలు సాధించారని కోచ్ మహ్మమద్ సైదా తెలిపారు. గురువారం ఏలూరురోడ్డులోని జిమ్‌లో పతకాలు సాధించిన బిల్డర్లను ఆయన అభినందించారు. 70కేజీల శరీర బరువు విభాగంలో ఎస్.దిలీప్, 75కేజీల శరీర బరువు విభాగంలో ఎం.నాగబాబు రజత పతకాలు, 80 ప్లస్ విభాగంలో వి.తరుణ్‌కుమార్ ప్రోత్సాహక బహుమతిని గెలుచుకున్నారని ఆయన పేర్కొన్నారు. పతక గ్రహీతలను వైద్యులు మలిరెడ్డి రవి, గంటా సురేష్ అభినందించారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

● ఎస్సీ సంఘాల డిమాండ్

పామర్రు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అమర్యాదకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దళితులకు, దేశ ప్రజలకు తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఎస్సీ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం నాయకులు నిరసన తెలిపారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పెగ్గం ప్రసాద్, మద్దుల సుబ్రహ్మణ్యం, విజయకుమార్ పాల్గొన్నారు.



పామర్రులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ సంఘాల నాయకులు



ఆర్టీసీ బస్సులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎంఈ వెంకట్రావు

ఎప్పటికప్పుడు బస్సులకు మరమ్మతులు చేయండి

● ఆర్టీసీ మెకానిక్‌లతో డిప్యూటీ సీఎంఈ వెంకట్రావు

గుడివాడ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కండిషన్‌లో లేని ఆర్టీసీ బస్సులకు మరమ్మతులు చేయకుండా చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా భారీనష్టం వాటిల్లుతుందని, మెకానిక్‌లందరూ బస్సుల కండిషన్‌ను పరిశీలిస్తూ ఎప్పటి మరమ్మతులు అప్పుడే చేయాలని విజయవాడ జోన్-2 డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.వెంకట్రావు సూచించారు. గురువారం రాత్రి గుడివాడ ఆర్టీసీ డిపోను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యారేజీలోని బస్సుల పనితీరు, సర్వీసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిపోలో కార్మికులకు సామగ్రి కొరత లేకుండా సమకూర్చాలన్నారు. బస్సుల మరమ్మతుల సమస్యలు తన దృష్టికి తేవాలని సూచించారు. మెకానిక్‌లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డిపో మేనేజర్ రాజేష్, డిపో ఉద్యోగులు, మెకానిక్‌లు ఆయన వెంట ఉన్నారు.



నాగపడగను ఈవో శ్రీరామవరప్రసాదరావుకు అందిస్తున్న నిహారి

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి నాగపడగ బహూకరణ

మోపిదేవి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పులిగడ్డ గ్రామానికి చెందిన మండలి నిహారి రూ. 50 వేల విలువైన 450 గ్రాముల వెండి నాగపడగను బహూకరించారు. గురువారం కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆమె స్వామిని దర్శించుకున్నాక నాగపడగను ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావుకు అందజేశారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.గోపాలరావు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికుల పిల్లల పెళ్లిళ్లకు, ప్రసవ సమయంలో సంక్షేమ బోర్డు ఆదుకునేదన్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తూ మృతిచెందితే అంత్యక్రియలకు సాయం అందించేవారన్నారు. దివ్యాంగులైన భవన నిర్మాణ కార్మికులకు సాయం అందేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 12, 14 మెమోతో కార్మికుల పొట్ట కొట్టిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ వాగ్దానాన్ని సీఎం నెరవేర్చాలన్నారు.

ముఠా కూలీ ఆత్మహత్య

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె చనిపోయిందన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజుపేటకు చెందిన ముఠా కూలీ కేసన జాను(21) గురువారం మద్యం తాగి విషం సేవించాడు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితో చేర్పించినా ప్రయోజనం లేకపోయింది. పెళ్లయిన కొద్దికాలనికే మృతిచెందడంతో అతని భార్య కల్యాణి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. జాన్ ఆత్మహత్యకు ఐదు నెలల కుమార్తె మృతిచెందడంతో పాటు కుటుంబ కలహాలే కారణమని పోలీసులు తెలిపారు. భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇనకుదురు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటరత్నం, శ్రీదేవి

గన్నవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని తిరుపతమ్మ తల్లి ఆలయ సేవా సదన్ నిర్మాణానికి పట్టణానికి చెందిన గుండపనేని వెంకటరత్నం, శ్రీదేవి దంపతుల కుమార్తెలు ఐనంపూడి లవకుమార్ లక్ష్మీ చరిత, చుక్కపల్లి సోమశేఖర్ లక్ష్మీ పూజితలు రూ.50,116 విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అందరి సహకారంతో అమ్మవారి వార్షిక కల్యాణానికి సేవ సదనాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కాసన్నేని నాని జాస్తి ఫణిశేఖర్, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	192
చికెన్ స్కిన్‌లెస్	202

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.610

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి నాగపడగ బహూకరణ

మోపిదేవి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పులిగడ్డ గ్రామానికి చెందిన మండలి నిహారి రూ. 50 వేల విలువైన 450 గ్రాముల వెండి నాగపడగను బహూకరించారు. గురువారం కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆమె స్వామిని దర్శించుకున్నాక నాగపడగను ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావుకు అందజేశారు.



నాగపడగను ఈవో శ్రీరామవరప్రసాదరావుకు అందిస్తున్న నిహారి



అవనిగడ్డ గ్రామసచివాలయం-1 గదుల్లో మద్యం సీసాలు, సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

గ్రామసచివాలయం గదుల్లో మద్యం సీసాలు

అవనిగడ్డ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలో గ్రామసచివాలయం-1 కార్యాలయ గదుల్లో, మెట్లపైన తాగి పడేసిన మద్యం సీసాలు ఉన్నాయి. గురువారం రెవెన్యూ సదస్సుకు విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. గ్రామ సచివాలయంలో మద్యం సీసాలు కనిపించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయం గదుల్లోనూ మద్యం సీసాలు కనిపించడంతో, మీరేం చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శి అనితను ప్రశ్నించారు. బయటి వ్యక్తులు రాత్రి వేళల్లో వచ్చేస్తున్నారని అనిత తెలిపారు. ఇతరులు లోపలికి రాకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలి కదా అని ప్రశ్నించారు. గ్రామ సచివాలయ భవనం, గదులు అపరిశుభ్రంగా ఉండటాన్ని పరిశీలించారు. తక్షణమే కార్యాలయం మొత్తం శుభ్రం చేయించాలని, మద్యం తాగేవాళ్ల లోపలికి రాకుండా చూడాలని ఆదేశించారు.

కొనకళ్ల..టీడీపీలో ఓ రోల్‌మోడల్

- తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు టీడీపీలో రోల్‌మోడల్ అని, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యేల విజయానికి పనిచేశారని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. గురువారం కొనకళ్లను తెలుగుమహిళా జిల్లా అధికార ప్రతినిధి మైనేని ఇందిర, విజయవాడ కనకదుర్గ దేవస్థానం అభివృద్ధి కమిటీ మాజీ సభ్యురాలు విశ్వనాథపల్లి పాపతో పాటు ఆమె కలిశారు. నూజివీడులో గౌతు లచ్చన్న విగ్రహ ప్రారంభోత్సవ సభకు కొనకళ్ల వెళితే అదే కార్యక్రమంలో వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ పాల్గొన్నారని, దీనిపై కొందరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అది సరికాదని అన్నారు. టీడీపీ విధానాలకు కట్టుబడి ఉంటానని, వాస్తవాలను చంద్రబాబుకు వివరిస్తానని కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేలు

విద్యుత్ అదాలత్‌లో

11 ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

అవనిగడ్డ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదాలత్‌లో వచ్చిన 11 ఫిర్యాదులను సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేలు వెంటనే పరిష్కరించారు. కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెసెల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్, అవగాహన కార్యక్రమం విక్టర్ ఇమ్మానియేలు అధ్యక్షతన గురువారం రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మంది విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదులను అందజేశారు. ఫోరం సభ్యులు, మచిలీపట్నం సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.సత్యానందం, ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణనాయక్, చల్లపల్లి, ఉయ్యూరు, అవనిగడ్డ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.గోపాలరావు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికుల పిల్లల పెళ్లిళ్లు, ప్రసవ సమయంలో సంక్షేమ బోర్డు ఆదుకునేదన్నారు. కార్మికుడు ప్రమాదవశాత్తూ మృతిచెందితే అంత్యక్రియలకు సాయం అందించేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు దివ్యాంగులైతే సాయం అందేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 12, 14 మెమోతో కార్మికుల పొట్ట కొట్టిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ వాగ్దానాన్ని సీఎం నెరవేర్చాలని కోరారు.

ఆర్యవైశ్య నేత చిట్టా పూర్ణచంద్రరావు మృతి



నాగాయలంక, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య ప్రముఖుడు, రాజకీయ నేత చిట్టా వెంకట పూర్ణచంద్రరావు(86) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం అర్ధరాత్రి స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం 9వ వార్డులోని పూర్ణచంద్రరావు ఇంటికి వచ్చి భౌతికకాయానికి నివాళులర్పించారు. మండలి వెంకట్రామ్, మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి మల్లికార్జునరావు, తలశిల వెంకట నరసింహారావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య, రేమాల మురళి, లకనం నాగాంజనేయులు, తిరుమలశెట్టి మస్తానరావు, లంకే శ్రీనివాస ప్రసాద్ నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పూర్ణచంద్రరావు భౌతికకాయానికి నివాళులర్పించారు.

నాంచారయ్య మాస్టారు కన్నుమూత



చల్లపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాంచారయ్య మాస్టారుగా అందరికీ చిరపరచితుడైన వేములపల్లి వెంకటనాంచారయ్య(86) కన్నుమూశారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. తొలినాళ్లలో ట్యుటోరియల్స్ నిర్వహించిన ఆయన విజయా అకాడమీలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయునిగా పనిచేశారు. భౌతికకాయాన్ని రామానగరంలోని మాజీ ఎంపీపీ లంకబాబు స్వగృహంలో ఉంచారు. ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, విజయా అకాడమీ ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, ఉపాధ్యాయ బృందం నాంచారయ్య మాస్టారి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. శుక్రవారం భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించనున్నారు.

ఇద్దరు వృద్ధుల నేత్రదానం

నాగాయలంక, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 11వ వార్డుకు చెందిన సబ్బినేని మాణిక్యాలరావు(85), 9వ వార్డుకి చెందిన ఆర్యవైశ్య నేత చిట్టా వెంకట పూర్ణచంద్రరావు (86) మరణించడంతో వీరిద్దరి నేత్రాలను కుటుంబసభ్యులు విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. గురువారం మృతుల నేత్రాలను సేకరించారు.





నాగాయలంకలో పనలపై ఉన్న వరి పంట, హడావుడిగా కుప్ప వేస్తున్న కూలీలు

వాతావరణంలో మార్పులు..

ఆందోళనలో రైతులు

నాగాయలంక, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా వాతావరణంలో మార్పులు రావడం, రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై ఉండడం, ఈదురుగాలులు వీచడంతో రైతుల కంటిమీద కునుకు లేకుండా పోతోంది. వరి పంట కోసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 15 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. 6 వేల ఎకరాల్లో కోతలు కోశారు. 2 వేల ఎకరాల్లో కుప్పలు వేశారు. 4 వేల ఎకరాల్లో కోసిన వరి పంట పనలపైన ఉంది. వాతావరణం మేఘావృతమై ఉండటంతో పనలు తేమగా ఉన్నాయి. పనలు ఆరకుండానే కుప్పలు వేస్తే ధాన్యం, వరిగడ్డి పాడైపోతాయని రైతులు అంటున్నారు. పనలు ఆరబెట్టుకున్న కొందరు రైతులు ఎక్కువ కూలీ ఇచ్చి హడావుడిగా కుప్పలు వేయిస్తున్నారు. వ్యవసాయాధికారులు సూచనలు పాటించి కొందరు కోతలు వాయిదా వేశారు. యంత్రాలతో కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ముఠా కూలీ ఆత్మహత్య

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె చనిపోయిందన్న బాధతో రాజుపేటకు చెందిన ముఠా కూలీ కేసన జాను(21) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం విషం తాగాడు. పెళ్లయిన కొద్దికాలనికే మృతిచెందడంతో అతని భార్య కల్యాణి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. జాన్ ఆత్మహత్యకు ఐదు నెలల కుమార్తె మృతిచెందడంతో పాటు కుటుంబ కలహాలే కారణమని పోలీసులు తెలిపారు. భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇనకుదురు సీఐ పరమేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. దర్యాప్తు చేస్తున్నారు.

మచిలీపట్నం- రేపల్లె రైలు మార్గం

కోడూరు మీదుగా నిర్మించాలి

అవనిగడ్డ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-రేపల్లె రైలు మార్గాన్ని బందరు నుంచి ఉల్లిపాలెం, కోడూరు, అవనిగడ్డ మీదుగా రేపల్లె వరకు నిర్మించాలని బీజేపీ జిల్లా నాయకుడు మునగాల బాలకృష్ణారావు ఒక ప్రకటనలో కోరారు. ఈ మార్గం ఏర్పాటుతో దివిసీమ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రజలకు ఉపయోగపడేలా పునరాలోచన చేయాలన్నారు.

చేపలు, రొయ్యలతో విలువ

ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ

నాగాయలంక, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో భావదేవరపల్లిలో చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఐదు రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి సూచించారు. మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, కేవీకే శాస్త్రవేత్త యశ్వంత్‌కుమార్, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

మోపిదేవి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5వ తేదీన నిర్వహిస్తున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీహెచ్‌పీ సభ్యులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. గురువారం వెంకటాపురం, పెదకళ్లేపల్లి, అడపావారిపాలెం గ్రామాల్లో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఇంటింటా వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మోపిదేవి మండల కమిటీ సభ్యులు అరజా ఏడుకొండలు, లింగం బసవ శంకరరావు, మెరకనపల్లి నాగేశ్వరరావు, శాఖమూరి బాలాజీ, మెరకనపల్లి నరేష్ పాల్గొన్నారు.



మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న కేవీపీఎస్ నాయకులు



అవనిగడ్డలో అమిత్ షా చిత్రాలను దహనం చేస్తున్న మాలమహానాడు నేతలు

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు హోం మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని కేవీపీఎస్ నాయకుడు సీహెచ్ రాజేష్ డిమాండ్ చేశారు. గురువారం కోనేరుసెంటర్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పి.రాజు, కొడాలి శర్మ, బి.సుబ్రహ్మణ్యం, విజయబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్యాబినెట్ నుంచి తొలగించాలి

అవనిగడ్డ: అంబేడ్కర్‌ను అవమానిస్తూ హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం మాలమహానాడు నేతలు నిరసన తెలిపారు. అమిత్ షాను క్యాబినెట్ నుంచి తొలగించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. అమిత్‌షా ముఖ చిత్రాలను దహనం చేశారు. కత్తుల రాజు, మేరుగు రణధీర్ పాల్గొన్నారు.

72వ సారి

రక్తదానం



రక్తదానం చేస్తున్న కస్తూరి విజయ్

చల్లపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రక్తదాత, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్త కస్తూరి విజయ్‌కుమార్ 72వ సారి రక్తదానం చేశారు. మచిలీపట్నం లాలిత్య హాస్పటల్‌లో ఎం.దేవకన్య అనే మహిళకు లాప్రోస్కోపిక్ అత్యవసర శస్త్రచికిత్స కోసం ఎ-పాజిటివ్ రక్తం కావాలని మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు విజయ్‌కుమార్‌ను సంప్రదించారు. వెంటనే విజయ్ మచిలీపట్నం వెళ్లి 72వ సారి రక్తదానం చేశారు. మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తున్న విజయ్‌కుమార్‌ను మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.

పటిష్ఠంగా పంచాయతీరాజ్ వ్యవస్థ

కోడూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రహదారులు నిర్మిస్తూ, తాగునీరు అందిస్తూ ప్రజల కనీస అవసరాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ తీరుస్తున్నారని, వారి ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్ఠంగా పనిచేస్తోందని జనసేన మండల అధ్యక్షుడు మర్రే గంగయ్య అన్నారు. గురువారం హరిపురంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను ఆయన పరిశీలించారు. కోట రాంబాబు, పూతబోయిన సీతారత్నసాయిబాబు, రామా రావు, పంచాయతీరాజ్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

కమలాపురం డీసీ చైర్మన్‌కు అభినందన

అవనిగడ్డ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెడన నియోజకవర్గం కమలాపురం డీసీ నూతన చైర్మన్ నల్లమోతు చంద్రమోహనరావు గురువారం అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. సుదీర్ఘకాలం నుంచి రాజకీయాల్లో ప్రజలకు సేవ చేస్తున్న సీనియర్ నాయకుడు చంద్రమోహనరావు డీసీ చైర్మన్‌గా ఎన్నిక కావడంపై ఎమ్మెల్యే ఆయనకు శుభాభినందనలు తెలిపారు.



ప్రసాద్‌కు సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందిస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నేతలు

సీఎం సహాయనిధి అందజేత

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): 43వ డివిజన్‌లో నివసిస్తున్న కె.బాలాత్రిపురసుందరి చికిత్స కోసం కుటుంబసభ్యులు రూ.5 లక్షల ఖర్చు పెట్టారు. మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో ఆమె కుమారుడు ప్రసాద్‌కు రూ. 2,59,507 సీఎం సహాయనిధి చెక్కును గురువారం మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అందజేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు, 43వ డివిజన్ జనసేన నాయకుడు కోలపల్లి గణేష్ పాల్గొన్నారు.

బాలిక కేసులో సాక్షి ఆచూకీ తెలపండి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒక బాలికకు సంబంధించిన కేసులో ఎనిమిదేళ్ల క్రితం ఫిర్యాదు చేసిన చింతగుంటపాలెం నివాసి పృథ్వి వెంకట సుబ్బారావు మృతి చెందాడని, అతని భార్య పృథ్వి శాంతి ఆ కేసులో సాక్ష్యం చెప్పాల్సి ఉందని, ఆమె ఆచూకీ తెలియడం లేదని, ఎవరికైనా తెలిస్తే డీఎస్పీ అబ్దుల్ సుబాన్ 9440796405, సీఐ పరమేశ్వర్ 8332983788కు తెలియజేయాలని ఇనకుదురు సీఐ పరమేశ్వర్ తెలిపారు. కోర్టు నోటీసులు ఇచ్చేందుకు సాక్షిగా ఉన్న పృథ్వి శాంతి ఆచూకీ తెలిస్తే తమకు తెలియజేయాలని, పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



అర్తమూరులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

బంటుమిల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం అర్తమూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 96 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని దీనికి ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం అన్నారు. సాయినగర్‌లో తోపు పోరంబోకును గ్రామకంఠంగా మార్చాలని డీసీ చైర్మన్ కాశీ, పార్టీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు కోరారు. రెవెన్యూ సదస్సులో భూముల సమస్యలపై అర్జీలను సేకరించారు. తహసీల్దార్ భరత్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పూర్ణ, ఆర్ఐ శంకర్, ఎస్సై గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

అవనిగడ్డ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసిందన్నారు. పలువురు రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ముడా డిప్యూటీ కలెక్టర్ ఐ.పద్మావతి, ఎంపీపీ తుంగల సుమతి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఎంపిటిసి బొప్పన భాను, దేవాదాయశాఖ మండల అధికారి యార్లగడ్డ శ్రీనివాసు,పంచాయతీ ఈవో అనిత పాల్గొన్నారు.

అర్చకులు పేరిట శిస్తు రశీదులు జారీ చేయాలి

అర్చకుల ఆధీనంలో ఉన్న సర్వీస్ ఈనాం భూములకు(ఆలయ భూములు) అర్చకుల పేరిట శిస్తు రశీదులు జారీ చేయాలని రెవెన్యూ సదస్సులో నోడల్ అధికారి పద్మావతికి గురువారం అర్చకులు వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గంలోని ఆలయ భూములకు వంశపారంపర్యంగా అర్చకుల పేరిట మాత్రమే శిస్తు చెల్లించి రశీదులు పొందుతున్నామని, ఇటీవల అర్చకుల పేరిట శిస్తులు ఇవ్వొద్దని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. దీంతో అర్చకుల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందటం లేదన్నారు. శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి చెందిన రెండెకరాల మెట్ట భూమిని పేదలకు నివేశనాస్థలాలు కింద స్వాధీనం చేసుకుని ఏళ్లు గడిచినా అర్చకులకు పరిహారం చెల్లించలేదని, ఆలయ సేవలు పూర్తిస్థాయిలో చేయలేకపోతున్నందున పరిహారం ఇప్పించాలని కోరారు. దీవి రఘు, అప్పలాచార్యులు, వాసుదేవ కృష్ణ వినతిపత్రం అందించారు.

వెంకటాపురంలో..

మోపిదేవి: వెంకటాపురం రెవెన్యూ సదస్సులో మండల ప్రత్యేకాధికారి టి.విష్ణు పాల్గొన్నారు. అన్నవరంలో భూమి ధ్రువపత్రాలు కుటుంబసభ్యుల పేరున ఉన్నా రికార్డుల్లో నమోదవలేదని, పాస్ పుస్తకాల కోసం తిరగాల్సి వస్తోందని నాయుడు భాస్కరరావు అనే రైతు అధికారుల దృష్టికి తెచ్చారు. ధ్రువపత్రాలను కలిపి అర్జీ అందజేయాల్సిందిగా అధికారులు సూచించారు. రైతుల నుంచి అర్జీలను తహసీల్దార్ ఎం.శ్రీవిద్య స్వీకరించారు. మండల సర్వేయర్ రామకృష్ణ, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో వరప్రసాద్, చల్లపల్లి గ్రూపు దేవాలయాల ఈవో ప్రవీణ పాల్గొన్నారు.

కోడూరులో 32 అర్జీలు

కోడూరు: పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పాస్ పుస్తకాలు, అడంగల్ కరెక్షన్, భూ సర్వే సమస్యలపై 32 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి పాల్గొన్నారు.